


ప్రభాత సూర్య
PRABHATA SURYA
తెలుగు దిన పత్రిక
www.suryaa.news

హైదరాబాద్
13-5-2026
వెల: రూ.5/-
పేజీలు: 8
సంపుటి: 09
సంచిక: 244

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

# 'నీట్' పరీక్ష రద్దు

## పేపర్ లీక్ ఆరోపణల నేపథ్యంలో ఎన్‌టీఏ కీలక నిర్ణయం

## అభ్యర్థులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వెల్లడి..

- త్వరలో పరీక్ష తేదీ ప్రకటన.. మళ్లీ అడ్మిట్ కార్డుల జారీ
- రుసుము చెల్లించకుండా మరోసారి పరీక్షకు హాజరయ్యే అవకాశం
- లీకేజీపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించిన కేంద్ర ప్రభుత్వం..
- మాస్టర్‌మైండ్ సహా 20 మందిని అదుపులోకి తీసుకున్న రాజస్తాన్ ఎస్‌ఓజీ
- గెస్ పేపర్‌లోని కొన్ని ప్రశ్నలు అసలైన ప్రశ్నపత్రంలో ప్రత్యక్షం
- పరీక్షకు 15 రోజుల ముందే కొందరు అభ్యర్థులకు చేరిన గెస్ పేపర్



న్యూఢిల్లీ: వైద్య విద్య అభ్యసించి, డాక్టర్‌గా ప్రజలకు సేవలందిస్తూ జీవితంలో ఉన్నతస్థాయికి ఎదగాలన్న ఆశయంతో జాతీయ అర్హత, ప్రవేశ పరీక్ష(నీట్)కు హాజరైన లక్షలాది మంది అభ్యర్థులకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) పిడుగులాంటి వార్త వినిపించింది. దేశవ్యాప్తంగా మెడికల్ కాలేజీల్లో అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశానికి

2లో



## జూన్ 2న ఇందిరమ్మ ఇళ్ల

# రెండోవిడుత పంపిణీ

### రెండోవిడతపై 21న కేబినేట్‌లో ఖరారు చేస్తాం

### స్పెషల్ డ్రైవ్ ద్వారా డబుల్ ఇళ్లు పంపిణీ

### అధికారులతో సమీక్షించిన మంత్రి పొంగులేటి

**హైదరాబాద్, ప్రభాత సూర్య :** రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జూన్ 2న ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత పంపిణీ ప్రారంభించనున్నట్లు తెలంగాణ గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని ఆదిలాబాద్‌లో ప్రారంభిస్తామని చెప్పారు. మంగళవారం గృహనిర్మాణశాఖ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల విధివిధానాలను ఈనెల 21న జరిగే మంత్రివర్గ సమావేశంలో ఖరారు చేస్తామని పొంగులేటి చెప్పారు.

2లో

## అసోం సిఎంగా హిమంత బిశ్వశర్మ

### ప్రమాణ కార్యక్రమానికి ప్రధాని హాజరు

### ఎన్‌డి ముఖ్యమంత్రుల్లో చంద్రబాబు రాక



గౌహతి,మే12: అస్సాం ముఖ్యమంత్రిగా హిమంత బిశ్వశర్మ ప్రమాణస్వీకారం చేశారు. అస్సాంలో వరుసగా రెండోసారి సీఎం పదవిని చేపట్టిన తొలి భాజపా నేతగా హిమంత నిలిచారు. ఆయనతో

## నర్సింగ్ వృత్తి ఎంతో పవిత్రమైనది

### వారి సేవలు చిరస్మరణీయం

### వారిది ఉదయోగం కాదు...నిరంతర సేవ

### 1919 మంది నర్సింగ్ ఆఫీసర్లకు నియామక పత్రాలు అందచేత

### వారి సేవలు నిరుపమానమని అన్న మంత్రి దామోదర



**హైదరాబాద్, ప్రభాత సూర్య :** ఆరోగ్యశాఖలో ఉద్యోగాలు పొందిన 1919 మంది నర్సింగ్ ఆఫీసర్లకు ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ నియామక పత్రాలు అందజేశారు. కోఠి ఉస్మానియా మెడికల్ కాలేజీ గ్రౌండ్‌లో మంగళవారం సాయంత్రం జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, మీర్జా రహ్మత్ బేగ్, ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తు, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ సంగీత సత్యనారాయణ,

2లో

# పెట్రో రేట్లను పెంచబోమని చెప్పలేం!



### ఇంధన ధరల పెంపుపై కేంద్ర ప్రభుత్వం యూటర్న్

### ధరలు పెంచమంటూ ఎన్నికల ముందు పదేపదే ప్రకటనలు

### ఎన్నికలయ్యాక నాలుక మడతేసిన బీజేపీ సర్కార్

న్యూఢిల్లీ, మే 12: దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు ఎట్టి పరిస్థితుల్లో పెంచబోమని ఐదు రాష్ట్రాల ఎన్నికల ముందు ఊదరగొట్టిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎన్నికలు పూర్తవగానే యూటర్న్ తీసుకుంది. ఎప్పుడెప్పుడు పెంచుదామా అన్నట్టు చమురు కంపెనీలు నష్టాలను ఎదుర్కొంటున్నాయని పదేపదే ప్రస్తావిస్తున్నది. ఈ క్రమంలో దేశంలో చమురు సరఫరాకు ఎలాంటి కొరత లేదని పేర్కొంటూనే, వాటి ధరను పెంచే అవకాశాన్ని కొట్టిపారేయ లేమంటూ కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి మంగళవారం స్పష్టం చేశారు. ఒక పక్క విదేశీ ప్రయాణాలకు స్వస్తి పలకాలని, ఏడాది పాటు బంగారాన్ని కొనుగోలు చేయవద్దని, పెట్రోల్, డీజిల్ వినియోగాన్ని తగ్గించాలని, కార్ పూలింగ్ పాటించాలని, మెట్రోలలో ప్రయాణించాలని, వర్క్ ఫ్రమ్ హోమ్ చేయాలని, ఆన్‌లైన్‌లో తరగతులను నిర్వహించాలని ప్రధాని చమురు పొదుపు చర్యల కోసం

2లో



## ఎంఎంటీఎస్ ఉచిత ప్రయాణం..

# జూన్ 2 నుంచేనా?

### ఎంఎంటీఎస్ ఉచిత ప్రయాణంపై రైల్వేబోర్డుకు అందని రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనలు

### బోర్డుతో అవగాహన ఒప్పందం కుదరాలన్న దక్షిణ మధ్య రైల్వే

హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రతిపాదించిన ఎంఎంటీఎస్ ఉచిత ప్రయాణం దిశగా ఇప్పటివరకు అడుగు ముందుకు పడలేదు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా

2లో



# బీఆర్ఎస్ కీలక నేతలతో కేసీఆర్ భేటీ

### ఎర్రవెల్లి ఫాంహౌస్ లో కీలక సమావేశం నిర్వహించిన కేసీఆర్

### పార్టీ సంస్థాగత మార్పులు, భవిష్యత్తు కార్యాచరణపై దిశానిర్దేశం

### పార్టీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేయడంపై ఫోకస్


బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అధ్యక్షతన ఎర్రవెల్లి ఫాంహౌస్ లో కీలక సమావేశం జరిగింది. పార్టీ సంస్థాగత మార్పులు, భవిష్యత్తు కార్యాచరణపై ఈ భేటీలో స్పష్టమైన దిశానిర్దేశం చేసినట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో మారుతున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో, పార్టీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేయడంపై కేసీఆర్ ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయడం... జిల్లా, నియోజకవర్గాల వారీగా పార్టీ ఇన్‌ఛార్జుల నియామకం,

## బండి భగీరథ్‌కు సిట్ నోటీసులు

### మైనర్ బాలికపై లైంగిక దాడి ఆరోపణల కేసు

### రేపు మధ్యాహ్నం విచారణకు హాజరు కావాలని నోటీసులు

### కేసును సీరియస్‌గా తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం



కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌కు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) నోటీసులు జారీ చేసింది. మైనర్ బాలికపై లైంగిక దాడి చేశాడనే ఆరోపణలతో

2లో

# జూన్ 2న ఇందిరమ్మ ఇళ్ల రెండోవిడుత పంపిణీ

పెండింగ్‌లో ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను లబ్ధిదారులకు ఇచ్చేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. హైదరాబాద్‌లో స్థలాలు ఉన్నవారికి ఈ నెలాఖరులోపు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని చెప్పారు. ప్రభుత్వ భూముల అన్యాక్రాంతంపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. రాష్ట్రంలో పేదల సొంత ఇంటి కలను సాకారం చేయడానికి సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అమలు చేస్తోందని పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మొదటి విడత ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కొలిక్కి వచ్చిన నేపథ్యంలో సీఎం రేవంత్ సూచన మేరకు రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవమైన జూన్ 2 వ తేదీన ఆదిలాబాద్ జిల్లాలో రెండో విడతను లాంఛనంగా ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. ఇందుకు సంబంధించిన విధివిధానాలపై ఈ నెల 21 వ తేదీన జరిగే మంత్రివర్గ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు చెందిన ఇన్ ఛార్జి మంత్రులు, జిల్లా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్లు, సైబరాబాద్, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ల కమిషనర్లు, హౌసింగ్, రెవెన్యూ, ఫారెస్టు అధికారులతో మంత్రి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశాల్లో శాసనసభ స్పీకర్ ప్రసాద్ కుమార్, రంగారెడ్డి జిల్లా ఇన్ ఛార్జి మంత్రి శ్రీధర్ బాబు, హైదరాబాద్ ఇన్ ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రి మహ్మద్ అజారుద్దీన్, శాసన మండలిలో చీఫ్ విప్ మహేందర్ రెడ్డి తదితర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వం దూరదృష్టి లేకుండా హైదరాబాద్ నగరానికి దూరంగా డబుల్ బెడ్ రూం ఇండ్లను నిర్మించడం వల్ల జరిగిన నష్టం కళ్లముందే కనిపిస్తున్నదన్నారు. అటువంటి తప్పు పునరావృత్తం కాకుండా పేదలు ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాలకు 5 నుంచి 8 కిలోమీటర్ల పరిధిలోనే ఇందిరమ్మ ఇండ్లను నిర్మించే విధంగా నియోజకవర్గాన్ని యూనిట్ గా తీసుకుని స్థలాలను గుర్తించి తగిన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఆనాటి ప్రభుత్వం నగరానికి 20 నుంచి 30 కిలోమీటర్ల దూరంలో 2 బిహెచ్ కె ఇండ్లను నిర్మించి హైదరాబాద్ నగరంలో నివసిస్తున్న వారికి కేటాయించడం వల్ల తమ జీవనోపాధికి ఇబ్బంది కలుగుతుందన్న ఉద్దేశ్యంతో ఇండ్లు తీసుకున్న లబ్ధిదారులు అక్కడ నివసించడానికి సంసిద్ధత వ్యక్తం చేయడం లేదని క్షేత్ర స్థాయి పరిశీలనల్లో స్పష్టమైందన్నారు. ఈ అంశాన్ని ప్రధానంగా దృష్టిలో ఉంచుకుని ఏ నియోజకవర్గానికి సంబంధించి ఆ నియోజకవర్గంలోనే ప్రభుత్వ స్థలాలు, మురికివాడలు, భూదాన్, గతంలో వివిధ పథకాల కింద నిర్మించిన ఇళ్లు శిధిలావస్థలో ఉన్న ప్రాంతాలను గుర్తించి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన

ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఈ విషయంలో ప్రజా ప్రతినిధులను భాగస్వామ్యులను చేయాలని అధికారులను ఆదేశించారు. 2 బిహెచ్ కె ఇండ్లకు లబ్దిదారులను కేటాయించడానికి యుద్ధప్రాతిపదికన స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని మంత్రి పొంగులేటి అధికారులను ఆదేశించారు. ఇప్పటికే పూర్తి అయిన వాటికి, వివిధ నిర్మాణ దశల్లో ఉన్న వాటికి ఈ నెలాఖరు కల్లా లబ్దిదారులను గుర్తించాలని, అది కూడా ఆ కాలనీలకు అయిదు నుంచి ఎనిమిది కిలోమీటర్ల లోపు ఉన్న వారినే ఎంపిక చేయాలని స్పష్టం చేశారు. ఇప్పటికే నిర్మాణాలన్నీ పూర్తైన ఇండ్లలో లబ్దిదారులు ఉండేలా చూసేలా నిరంతరం పర్యవేక్షించా లన్నారు. ఈ కాలనీల్లో మంచినీరు, డ్రైనేజి, విద్యుత్ వంటి కనీస సౌకర్యాల కల్పనకు వేగవంతమైన చర్యలు తీసుకోవాలన్నారు. హైదరాబాద్ పరిధిలో ఇండ్ల స్థలాలు ఉండి అర్హులైన లబ్దిదారులకు ఈనెల చివరిలోగా ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను అందజేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లా హౌసింగ్ ప్రాజెక్టు డైరక్టర్లు మరింత క్రియాశీలకంగా వ్యవహరించాలని, పనితీరు మెరుగుపడాలని అన్నారు. పిడిలు తమ పరిధిలో గతంలో నిర్మించిన జెన్ఎన్ యుఆర్ఎం, రాజీవ్ గృహకల్ప, వాంబే హౌసింగ్ కాలనీలన్నిటిని సందర్శించాలని స్పష్టంగా నిర్దేశించారు.

# 'నీట్' పరీక్ష రద్దు

ఈ నెల 3వ తేదీన జరిగిన నీట్(యూజీ)--2026 పరీక్షను రద్దు చేసినట్లు మంగళవారం ప్రకటించింది. నీట్ ప్రశ్నపత్నం లీక్ అయినట్లు అనుమానాలు తలెత్తిన నేపథ్యంలో జాతీయ పరీక్షా వ్యవస్థలో పారదర్శకతను కాపాడటం, విశ్వాసాన్ని నిలబెట్టడం కోసం కేంద్ర ప్రభుత్వ అనుమతితో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్టుచేసింది. నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు జరపాలని సీబీఐని కేంద్రం ఆదేశించిందని, దర్యాప్తు సంస్థకు తమ పూర్తి సహాయ, సహకారాలు అందిస్తామని, అవసరమైన రికార్డులు సమకూరుస్తామని ఎన్‌టీఏ స్పష్టంచేసింది. పరీక్ష జరిగిన నాలుగు రోజుల తర్వాత.. అంటే మే 7న సాయంత్రం అవకతవకలకు సంబంధించిన సమాచారం ఎన్‌టీఏకు అందింది. స్వతంత్ర ధ్రువీకరణతోపాటు అవసరమైన చర్యల కోసం మే 8వ తేదీ ఉదయం కేంద్ర దర్యాప్తు సంస్థలకు నివేదించినట్లు ఎన్‌టీఏ వెల్లడించింది.

**పరీక్షా వ్యవస్థపై నమ్మకాన్ని కాపాడేందుకే..**

పరీక్షకు ముందే 410 ప్రశ్నలతో కూడిన 'గెస్ పేపర్'కొందరు అభ్యర్థుల మధ్య సర్క్యులేట్ అయ్యిందని, అందులో 120 కెమిస్ట్రీ, 100కు పైగా బయాలజీ ప్రశ్నలు అసలైన ప్రశ్నపత్రంతో యథాతథంగా సరిపోలాయన్న ప్రచారంతో 'నీట్'ను రద్దు చేసి, మళ్లీ నిర్వహించడమే ఉత్తమమన్న నిర్ణయానికి వచ్చినట్లు ఎన్‌టీఏ పేర్కొంది. ఈ నెల 3న భారత్‌తోపాటు విదేశాల్లో జరిగిన నీట్(యూజీ)--2026 పరీక్షను 22.79 లక్షల మంది రాశారు. పేపర్ లీకేజీతో వారంతా నిరాశకు గురయ్యారు. పరీక్ష మళ్లీ నిర్వహిస్తామని, అభ్యర్థులెవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని ఎన్‌టీఏ ప్రకటించింది. పరీక్ష తేదీని త్వరలో ప్రకటిస్తామని తెలియజేసింది. పరీక్షను మళ్లీ నిర్వహించడం వల్ల అభ్యర్థులకు, తల్లిదండ్రులకు అసౌకర్యం కలిగే మాట నిజమేనని ఎన్‌టీఏ అంగీకరించింది. కానీ, పరీక్షా వ్యవస్థపై నమ్మకాన్ని కాపాడేందుకు నీట్ రద్దు నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది.

**'గెస్ పేపర్'కోసం రూ.30 లక్షలు**

'గెస్ పేపర్'కోసం ఒక్కో విద్యార్థి దాదాపు రూ.30 లక్షల చొప్పున వెచ్చించినట్లు తమ విచారణలో తేలిందని రాజస్తాన్ స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్(ఎస్ఓజీ) ఏడీజీ విశాల్ బన్సాల్ మీడియాకు తెలిపారు. ఈ గెస్ పేపర్ పరీక్షకు 15 రోజుల ముందే అభ్యర్థులకు చేరిందన్నారు. డెహ్రాడూన్ నుంచి కేరళ మీదుగా సికార్‌కు చేరిన ఈ పేపర్‌ను ఒక్కో విద్యార్థి రూ.20 వేల నుంచి రూ.30 లక్షల వరకు వెచ్చించి కొనుగోలు చేసినట్లు విచారణలో బయటపడిందన్నారు.

పరీక్ష ముందు రాత్రి అంటే.. మే 2వ తేదీ రూ.30 వేలకు కూడా కాపీలు అమ్మినట్లు ఆధారాలు లభించాయని ఎన్‌టీఏకు, కేంద్ర పభుత్వానికి నివేదించారు. ఎస్ఓజీ దర్యాప్తులో భాగంగా లభించిన ఆధారాలతో ఇప్పటివరకు మాస్టర్‌మైండ్ సహా 20 మందికి పైగా అదుపులోకి అనుమానితులను తీసుకున్నట్లు సమాచారం. నీట్ పేపర్ లీకేజీకి జైపూర్‌కు చెందిన మనీష్ అనే వ్యక్తిని మాస్టర్ మైండ్‌గా గుర్తించారు. రాజస్తాన్‌లో సికార్ పట్టణానికి చెందిన ఒక కోచింగ్ కెరీర్ కౌన్సెలర్‌ను అరెస్టు చేశారు.

ఎఫ్ఐఆర్ నమోదు చేసిన సీబీఐ

నీట్ పేపర్ లీక్ అంశం దేశవ్యాప్తంగా దుమారం సృష్టించింది. పలు ప్రాంతాల్లో అభ్యర్థులు ఆందోళనకు దిగారు. ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని, తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై ఎన్‌టీఏ స్పందించి పరీక్షను రద్దు చేసింది. లీకేజీ వ్యవహారంలో ఎంతటి వారున్నా వదిలిపెట్టే ప్రసక్తే లేదని కేంద్ర ప్రభుత్వ పెద్దలు చెబుతున్నారు. సీబీఐ రంగంలోకి దిగింది. ఇప్పటికే రాజస్తాన్ పోలీసుల దర్యాప్తులో లభించిన వాట్సాప్ చాటింగ్‌లు, స్క్రీన్‌షాట్లు, బ్యాంక్ లావాదేవీల వివరాలు, యూపీఐ చెల్లింపులు, క్రిప్టో చెల్లింపులను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించారు. పరీక్ష జరిగిన అన్ని సెంటర్ల సీసీటీవీ ఫుటేజీ, బయోమెట్రిక్ డేటాను సేకరించారు. ఆ డేటాను, ఆధారాలను రాజస్తాన్ పోలీసులు సీబీఐకి అప్పగించారు. నీట్(యూజీ) పేపర్ లీక్ అంశంపై సీబీఐ మంగళవారం ఎఫ్ఐఆర్ నమోదు చేసింది.

**ముఖం చాటేసిన విద్యాశాఖ మంత్రి**

నీట్ పేపర్ లీక్‌పై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మౌనం వహించారు. ఢిల్లీలో ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఆయనను మీడియా ప్రతినిధులు ప్రశ్నించేందుకు ప్రయత్నించగా, తప్పించుకుని కారెక్కి వెళ్లిపోయారు.

## పోస్టల్ శాఖ జీడీఎస్: మూడో మెరిట్ జాబితా విడుదల..

### ఇండియా పోస్ట్ జీడీఎస్ మూడో మెరిట్ జాబితా విడుదల

### దేశవ్యాప్తంగా 6,690 మంది అభ్యర్థుల ఎంపిక

### ఆంధ్రప్రదేశ్‌లో 342, తెలంగాణలో 106 మందికి అవకాశం

### మే 26 లోగా డాక్యుమెంట్ వెరిఫికేషన్ పూర్తి చేసుకోవాలి

భారత తపాలా శాఖ గ్రామీణ డాక్ సేవక్ (జీడీఎస్) పోస్టుల భర్తీ ప్రక్రియలో మరో కీలక ముందడుగు వేసింది. దేశవ్యాప్తంగా 28,636 జీడీఎస్ ఖాళీల భర్తీకి సంబంధించి మూడో మెరిట్ జాబితాను (సప్లిమెంటరీ లిస్ట్–×××) సోమవారం విడుదల చేసింది. జనవరి 2026 షెడ్యూల్‌లో భాగంగా చేపట్టిన ఈ నియామక ప్రక్రియలో, మొదటి రెండు జాబితాల తర్వాత మిగిలిపోయిన ఖాళీలను ఈ జాబితాతో భర్తీ చేయనున్నారు. ఈ మూడో జాబితాలో దేశవ్యాప్తంగా మొత్తం 6,690 మంది అభ్యర్థులు ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్ నుంచి 342 మంది, తెలంగాణ నుంచి 106 మంది చోటు దక్కించుకున్నారు. ఎంపికైన అభ్యర్థులు తమ అధికారిక ధ్రువపత్రాల పరిశీలన (డాక్యుమెంట్ వెరిఫికేషన్) ప్రక్రియను పూర్తి చేసుకోవాల్సి ఉంటుంది. జాబితాలో ఎంపికైన అభ్యర్థులు మే 26, 2026 లోపు తమకు కేటాయించిన డివిజనల్ కార్యాలయానికి హాజరు కావాలి. "షార్ట్‌లిస్ట్ చేయబడిన అభ్యర్థులు తమ పత్రాలను ధృవీకరించుకోవాలి. అన్ని సంబంధిత పత్రాల అసలు ప్రతులు మరియు రెండు సెట్ల ఫోటోకాపీలతో హాజరు కావాలి" అని అధికారిక నోటిఫికేషన్‌లో స్పష్టం చేశారు. గడువులోగా వెరిఫికేషన్‌కు హాజరుకాని పక్షంలో వారి అభ్యర్థిత్వం రద్దవుతుంది.

# ఎంఎంటీఎస్ ఉచిత ప్రయాణం.. జూన్ 2 నుంచేనా?

జూన్ 2 నుంచి గ్రేటర్‌లో ఎంఎంటీఎస్ రైళ్లలో అన్ని వర్గాల ప్రయాణికులకు ఉచిత ప్రయాణ సదుపాయాన్ని కల్పించనున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల ప్రకటించారు. ప్రజారవాణా వ్యవస్థను బలోపేతం చేసేదిశగా ఉచిత సేవలను అందుబాటులోకి తేనున్నట్లు చెప్పారు. ఇందుకోసం దక్షిణ మధ్య రైల్వేకు ఏటా రూ.10 కోట్లు అందజేయనున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. ఈ ప్రతిపాదనపైన దక్షిణమధ్య రైల్వే అధికారులు సానుకూలంగా స్పందించినప్పటికీ రైల్వేబోర్డు ఆమోదిస్తే తప్ప తాము ఈ సదుపాయాన్ని కల్పించలేమని, రాష్ట్ర ప్రభుత్వం, రైల్వేబోర్డు మధ్య అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదరాల్సి ఉంటుందని చెబుతున్నారు. ప్రస్తుతం నగరంలోని వివిధ మార్గాల్లో ప్రతిరోజు సుమారు 75 ఎంఎంటీఎస్ సర్వీసులు నడుస్తున్నాయి. 35 వేల మందికి పైగా ప్రయాణిస్తున్నారు. ఉచిత ప్రయాణ సదుపాయం కల్పిస్తే ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగే అవకాశం ఉంటుంది. దీంతో వ్యక్తిగత వాహనాల వినియోగం కొంత మేరకు తగ్గవచ్చునని అధికారులు భావిస్తున్నారు. 'రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనలు ఆచరణాత్మకంగానే ఉన్నప్పటికీ రైల్వేబోర్డుకు ఇంకా సమాచారం అందజేయలేదు. ఇప్పటికిప్పుడు ప్రతిపాదనలు సిద్ధం చేసి అందజేసినా రైల్వేబోర్డు పరిశీలించి నిర్ణయం తీసుకొనేందుకు కొంత సమయం పట్టవచ్చు. పైగా ఎంవోయూ కూడా కుదుర్చుకోవలసి ఉంటుంది. జూన్ 2 లోపు ఇదంతా సాధ్యం కాకపోవచ్చుననిపిస్తోంది..'అని దక్షిణమధ్య రైల్వే అధికారి ఒకరు అభిప్రాయపడ్డారు. పైగా ఎంఎంటీఎస్ రెండో దశకు సంబంధించి రాష్ట్రం నుంచి రావలసిన రూ.460 కోట్లకు పైగా బకాయిలపైనా స్పష్టత రావలసి ఉందని ఆయన అన్నారు. హైదరాబాద్‌లో లోకల్ ట్రైన్ సదుపాయాన్ని కల్పించే లక్ష్యంతో ఎంఎంటీఎస్ ప్రాజెక్టును 2003లో స్పెషల్ పర్పస్ వెహికిల్ (ఎస్పీవీ)గా ఏర్పాటు చేశారు. దీని నిర్మాణానికి అయ్యే వ్యయాన్ని రాష్ట్ర ప్రభుత్వం 2/3 వంతు, రైల్వేశాఖ 1/3 వంతు చొప్పున భరించాలని అప్పట్లో నిర్ణయించారు. ఈ మేరకు మొదటి దశ రైళ్లు అందుబాటులోకి వచ్చాయి. 2013లో ఇదే ఒప్పందం ఆధారంగా రెండోదశను ప్రారంభించారు. కానీ ప్రభుత్వం తన వాటా నిధులను పూర్తిగా చెల్లించలేదు. దీంతో ఈ ప్రాజెక్టును దక్షిణ మధ్య రైల్వే సొంతంగా పూర్తి చేయవలసి వచ్చింది. ప్రస్తుతం ఘటకేసర్ నుంచి రాయగిరి వరకు చేపట్టిన యాదాద్రి ఎంఎంటీఎస్ పనులను కూడా దక్షిణ మధ్య రైల్వే సొంత నిధులతో చేపట్టింది. ఇదిలావుండగా రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని తెరపైకి తేవడంతో..ఇప్పటివరకు రెండో దశ నిధులను చెల్లించకపోవడాన్ని రైల్వే అధికారులు ప్రధానంగా ఎత్తిచూపుతున్నారు. ఎంఎంటీఎస్ రైళ్లలో సమయ పాలన మెరుగుపడి, సర్వీసులు పెంచితేనే ప్రయాణికులకు ఉచిత సదుపాయం సద్వినియోగమవుతుందని హైదరాబాద్ యూనిఫైడ్ మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ (హుమ్టా) అధికారులు భావిస్తున్నారు.

## నర్సింగ్ వృత్తి ఎంతో పవిత్రమైనది

డీఎంఈ నరేంద్ర కుమార్, టీవీవీపీ కమిషనర్ అజయ్ కుమార్, డీపీహెచ్ రవింద్ర నాయక్, హైదరాబాద్ కలెక్టర్ ప్రియాంక తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి నర్సులను ఉద్దేశించి ప్రసంగించారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలోని నర్సులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగం సాధించిన నర్సింగ్ ఆఫీసర్లకు, వారి కుటుంబ సభ్యులకు హృదయపూర్వక అభినందనలు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవం రోజునే నియామక పత్రాలు అందించడం ఎంతో సంతోషంగా ఉంది. ఈరోజు మీకు జీవితాంతం గుర్తుండిపోతుంది.నర్సింగ్ అనేది కేవలం ఒక వృత్తి కాదు.. మానవత్వానికి చేసే గొప్ప అవకాశం. రోగులకు చికిత్స అందించడమే కాదు.. వారికి ధైర్యం, భరోసా, ఆశను కల్పించేది నర్సులే.
ప్రపంచ నర్సింగ్ రంగానికి మార్గదర్శకురాలైన ఫ్లోరెన్స్ నైటింగేల్ సేవలను ఈ సందర్భంగా మనం స్మరించుకోవాలి.పరిశుభ్రత, క్రమశిక్షణ, శాస్త్రీయ వైద్య సేవల ప్రాముఖ్యతను

ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయురాలు ఆమె.మీరు అందరూ ఆమెను ఆదర్శంగా తీసుకుని పనిచేయాలి. కోవిడ్‌లో కుటుంబ సభ్యులు కూడా పేషెంట్ల దగ్గర ఉండలేని పరిస్థితి, అటువంటి భయంకర మైన పరిస్థితుల్లో కూడా నర్సులు సేవలు అందించారు. తెలంగాణ ప్రజలు ఆ సేవలను ఎప్పటికీ గుర్తుంచు కుంటారు. గతంలో ప్రభుత్వ హాస్పిటళ్లలో భారీగా ఖాళీలు ఉండటం వల్ల వైద్య సిబ్బందిపై తీవ్ర ఒత్తిడి ఉండేది. ఈ సమస్యను మా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంతో తీసుకుని భారీ స్థాయిలో నియామకాలు చేపట్టింది. గత రెండున్నరేళ్లలో ఆరోగ్యశాఖలో దాదాపు 13 వేల పోస్టులను భర్తీ చేశాం. ఇదే గ్రౌండ్‌లో ఇప్పటికే 1,257 మంది ల్యాబ్ టెక్నీషియన్లకు నియామక పత్రాలు అందజేశాం. ఇక్కడే 623 మంది సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్ట్‌లకు నియామక పత్రాలు అందించాం. ఇక్కడే 132 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్‌లకు నియామక పత్రాలు అందించాం. ఈరోజు ఇక్కడే 1919 మంది నర్సింగ్ ఆఫీసర్లకు నియామక పత్రాలు అందిస్తున్నాం అని మంత్రి వివరించారు. గతంలో 6956 నర్సింగ్ ఆఫీసర్ పోస్టులు భర్తీ చేశాం. రెండున్నర సంవత్సరాల్లో 9 వేల నర్సింగ్ పోస్టులను భర్తీ చేసిన ఘనత మన ప్రభుత్వానికి దక్కుతుంది. దాదాపు మరో 5 వేల పోస్టుల భర్తీ పక్రియ కొనసాగుతోంది. ఇందులో సుమారు 2 వేల ఏఎన్ఎం పోస్టుల ఫలితాలు మరో ఒకటి, రెండు రోజుల్లో ప్రకటిస్తాం.న్యాయపరమైన కారణాలతో ఆలస్యమైన 732 ఫార్మసిస్ట్ పోస్టుల భర్తీని కూడా త్వరలో పూర్తి చేస్తాం అని మంత్రి దామోదర వెల్లడించారు.

## పెట్రో రేట్లను పెంచబోమని చెప్పలేం!

దేశ పౌరులకు సలహాలు ఇస్తుండగా, మరో వైపు చమురు ధరలు పెరుగుతాయంటూ ఆ శాఖ మంత్రే సూచన ప్రాయంగా తెలియజేశారు.'గత నాలుగేండ్లుగా మనం చమురు ధరలను పెంచలేదు. ఎన్నికలై పోయాయి కాబట్టి ఇప్పుడు వాటి ధరలు పెంచుతారంటూ కొందరంటున్నారు. అయితే 2022 తర్వాత మనకు సాధారణ ఎన్నికలతో పాటు పలు ఎన్నికలు దేశంలో వచ్చాయి. ధరలు పెరగవని చెప్పడం నా వాదన కాదు. అయితే ఆ రెండింటికీ సంబంధం లేదన్న విషయాన్ని మాత్రం స్పష్టం చేయదలచుకున్నా' అని ఆయన చెప్పుకొచ్చారు. పశ్చిమాసియా యుద్ధ ప్రభావం వల్ల ఇంధన పొదుపు చర్యల గురించి ప్రధాని కోరుతున్నారని తెలిపారు.

## బండి భగీరథ్‌కు సిట్ నోటీసులు

అతనిపై పోక్సో కేసు నమోదైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో విచారణకు హాజరు కావాలంటూ సిట్ నోటీసులు పంపించింది. రేపు మధ్యాహ్నం రెండు గంటలకు పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో విచారణకు హాజరు కావాలని అందులో పేర్కొంది.బండి భగీరథ్ కేంద్ర మంత్రి కుమారుడు కావడంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ కేసును సీరియస్‌గా తీసుకుంది. కేసు విచారణ పారదర్శకంగా జరగాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డీజీపీని ఇటీవల ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ కేసు సిట్ విచారిస్తోంది. బండి భగీరథ్?పై బాధితురాలి తల్లి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. మరోవైపు, తనను హనీట్రాప్ చేశారని బండి భగీరథ్ కరీంనగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

## బీఆర్ఎస్ కీలక నేతలతో కేసీఆర్ భేటీ

అలాగే అంతర్గత కమిటీల ఏర్పాటుపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపడానికి ఈ సంస్థాగత మార్పులు దోహదపడతాయని నాయకత్వం భావిస్తోంది. ఈ సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తో పాటు, పార్టీ ప్రధాన కార్యదర్శులు, శాసనసభ, మండలి పక్షాల ప్రముఖ నేతలు పాల్గొన్నారు. హరీశ్ రావు, సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, మధుసూదనాచారి, ఎల్. రమణ, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శులు తక్కెళ్లపల్లి రవీందర్ రావు, పల్లా రాజేశ్వర్ రెడ్డి, బండ ప్రకాశ్ ముదిరాజ్, వి. గంగాధర్ గౌడ్, జోగినపల్లి సంతోశ్ కుమార్, నారదాసు లక్ష్మణరావు, ఆర్. శ్రవణ్ కుమార్ రెడ్డి, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, టి. జీవన్ రెడ్డి, సోమా భరత్ కుమార్ గుప్తా, సత్యవతి రాథోడ్, రావుల చంద్రశేఖర్ రెడ్డి తదితరులు సమావేశానికి హాజరయ్యారు. ప్రత్యేక ఆహ్వానితులుగా సురేశ్ రెడ్డి, మహమూద్ అలీ, మారెడ్డి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు మరియు ఇతర రాజకీయ సవాళ్లపై ఈ సమావేశంలో నేతలు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. ప్రభుత్వ విధానాలపై పోరాటం చేస్తూనే, ప్రజల్లోకి పార్టీని మరింత సమర్థవంతంగా తీసుకువెళ్లేందుకు అవసరమైన ప్రణాళికలను ఈ సమావేశంలో సిద్ధం చేసినట్లు సమాచారం. త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా పార్టీ విస్తృత స్థాయి సమావేశాలు నిర్వహించాలని, అలాగే జిల్లా పర్యటనల ద్వారా క్యాడర్‌తో నేరుగా మమేకం కావాలని కేసీఆర్ సూచించినట్లు తెలుస్తోంది.

## అసోం సిఎంగా హిమంత బిశ్వశర్మ

పాటు మరో నలుగురు మంత్రులు ప్రమాణం చేశారు. ఉదయం 11.40 గంటలకు గువాహటిలోని వెటర్నరీ కాలేజీ ఫీల్డ్‌లో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్య ఆయనతో ప్రమాణస్వీకారం చేయించారు. బిశ్వ శర్మతో పాటు బీజేపీ నుంచి ఇద్దరు, ఏజీపీ, బీపీఎఫ్ నుంచి ఒక్కొక్కరు మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. అస్సాంలో బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి రావడం ఇది వరుసగా మూడోసారి కాగా, అసోం ముఖ్యమంత్రిగా శర్మ పగ్గాలు చేపట్టడం రెండోసారి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్, పలువురు కేంద్ర మంత్రులు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ సహా పలువురు ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉపముఖ్యమంత్రులు హాజరయ్యారు.హిమంత బిశ్వ శర్మతో పాటు రామేశ్వర్ తేలి, అతుల్ బోరా, చరణ్ బోరో, అజంతా నియోగ్ మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు.

# రైస్ మిల్లర్లు ప్రభుత్వ ఐకెపి కొనుగోలు కేంద్రాల ధాన్యాన్ని అన్లోడ్ చేసుకునేందుకు ప్రాధాన్యత ఇవ్వాలి

- జిల్లాలో ఇప్పటివరకు 4.10 లక్షల టన్నుల ధాన్యంకొనుగోలు
- ధాన్యం కొనుగోలులో మిల్లర్లు ప్రభుత్వానికి పూర్తి సహకారించాలి
- రైతులకు ఇబ్బందులు సృష్టిస్తే కఠిన చర్యలు
- జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ హెచ్చరిక





**మిర్యాలగూడ మే 12:-( ప్రభాత సూర్య):** జిల్లాలోని రైస్ మిల్లర్లు ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల నుండి వచ్చిన ధాన్యాన్ని దించుకునేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అన్నారు. అలా కాదని ప్రైవేటు ధాన్యం దించుకునేందుకు ప్రాధాన్యత ఇస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రబీ ధాన్యం సేకరణలో భాగంగా మిల్లుల వద్ద దాన్యం లారీల అన్లోడింగ్ జాప్యం జరుగుతున్నదని వార్తలు వచ్చిన నేపథ్యంలో మంగళవారం అయన జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవర్ తో కలిసి మిర్యాలగూడ లోని వాగ్దేవి రైస్ మిల్, మహేశ్వరి పారా బాయిల్డ్ రైస్ మిల్లులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా వాగ్దేవి రైస్ మిల్లును ఆయన తనిఖీ చేసి మిల్లుకు వచ్చిన ప్రభుత్వ, ప్రైవేటు ధాన్యాన్ని పరిశీలించారు. మిల్లు యజమానితో మాట్లాడుతూ ప్రభుత్వ ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాల నుండి వచ్చిన దాన్యం పూర్తిగా కొనుగోలు చేసిన తర్వాత ప్రైవేట్ ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఆదేశించారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన దాన్యం లోడు లారీల డ్రైవర్లతో ఆయన మాట్లాడుతూ మిల్లుకొచ్చిన లారీలు 12 గంటల్లో అన్లోడ్ చేసుకుని తిరిగి కొనుగోలు కేంద్రాలకు పంపించాలని ఆదేశించారు. అవసరమైతే హమాలీలను ఎక్కువ మందిని ఏర్పాటు చేసుకొని అన్లోడ్ ను పెంచాలన్నారు. రానున్న 10 రోజులు జిల్లాలో ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలని, ప్రత్యేకించి ప్రభుత్వ ఐకెపి కేంద్రాల ధాన్యం కొనుగోలును వేగవంతం చేసేందుకు ఇతర ప్రాంతాల నుండి ధాన్యం రాకుండా డిండి, అవంతిపురం తదితర ప్రాంతాలలో చెక్ ఫోస్టులు ఏర్పాటు చేయాలని, వ్యవసాయ, రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులతో బృందాన్ని ఏర్పాటు చేయాలన్నారు. అలాగే మిల్లుల వద్ద ఒక పోలీస్ కానిస్టేబుల్ తో పాటు జిపిఓ, ఇతర అధికారులు నిరంతరం ధాన్యం అన్లోడ్ పర్యవేక్షించాలని, అందరు రైస్ మిల్లర్లు ఇదే విధానాన్ని పాటించాలన్నారు. అనంతరం మహేశ్వరి పారాబాయిల్డ్ రైస్ మిల్లును ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. కాగా ఈ రైస్ మిల్లులో మిల్లు గుమాస్తా మాడుగులపల్లి మండలానికి చెందిన ఒక రైతు నుండి డబ్బులు తీసుకున్నాడని ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఆయన అన్ని రికార్డులను పరిశీలించి వచ్చిన ఆరోపణలపై విచారణ నిర్వహించి నివేదిక సమర్పించాలని మాడుగులపల్లి తహసిల్దార్ సరోజ పావనిను ఆదేశించారు. అంతకుముందు కలెక్టర్ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ జిల్లాలో రబీ ధాన్యం సేకరణలోభాగంగా ఇప్పటివరకు 4.10లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని, ఇంకా 2.6 లక్షల మెట్రిక్ టన్నుల దాన్యం కొనాల్సి ఉందని చెప్పారు. మిల్లర్లు త్వర త్వరగా ధాన్యాన్ని అన్లోడ్ చేసుకునేందుకుగాను ఎస్పీ తో రైస్ మిల్లులను సందర్శిస్తున్నట్లు చెప్పారు. అన్ని రైస్ మిల్లులకు ప్రైవేటు, ప్రభుత్వ దాన్యం వస్తున్న మిల్లర్లు ప్రైవేట్ ధాన్యానికి ప్రాధాన్యత ఇవ్వకుండా ప్రభుత్వ కేంద్రాల ద్వారా వచ్చిన ధాన్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రభుత్వ ధాన్యం పూర్తిగా కొనుగోలు జరిగిన తర్వాత ప్రైవేట్ ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఆదేశించారు. రైస్ మిల్లులు ఎంత వీలైతే అంత ధాన్యాన్ని అన్లోడ్ చేసుకోవాలన్నారు. ప్రతి మిల్ పాయింట్ వద్ద ఒక అధికారిని, పోలీసును ఏర్పాటు చేస్తున్నామని, వచ్చిన లారీలు 12 గంటల్లోపు ధాన్యాన్ని అన్లోడ్ చేసి తిరిగి పిపిసి కేంద్రాలకు వెళ్లిపోయేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించామని, రానున్న పది రోజులు జిల్లాలో ప్రైవేటు వ్యక్తుల నుండి వచ్చిన ధాన్యాన్ని కొనకుండా పెట్టాల్సిందిగా ఆయన అధికారులు, మిల్లర్లను ఆదేశించారు. జిల్లాలో ఇప్పటివరకు 62 శాతం దాన్యాన్ని కొనుగోలు చేశామని, ఇంకా 32 శాతం కొనుగోలు చేయాల్సి ఉందని , ధాన్యం కొనుగోలులో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా కొనుగోలు చేసేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. మిల్లర్లకు సంబంధించి బాయిల్డ్ కోటా ఇవ్వడం, మిల్లర్ చార్జీలు ఇవ్వడం వంటివి పూర్తి చేయడం జరిగిందని అందువల్ల మిల్లర్లు సైతం పూర్తిస్థాయిలో ప్రభుత్వానికి రైతులకు సహకరించాలని కోరారు. క్షేత్రస్థాయిలో ధాన్యం కొనుగోలును ఎప్పటికప్పుడు పర్యవేక్షించి రైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తామని కలెక్టర్ వెల్లడించారు. జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవర్ మాట్లాడుతూ మిల్లర్లు మిల్లు పాయింట్ కి వచ్చిన వాహనాలను 12 గంటల్లో అన్లోడ్ చేసుకోవాలని, అన్లోడ్ చేసుకోవడంలో ఇబ్బందులు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, పోలీసు తరఫున మిల్లులో ఒక కానిస్టేబుల్ ను ఏర్పాటు చేస్తామని, ప్రభుత్వ ధాన్యాన్ని దించుకునేందుకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. మిర్యాలగూడ ఆర్డీఓ ఎస్.రమణారెడ్డి, పౌరసరఫరాల జిల్లా అధికారి వెంకటేషం, డిఎస్పి కె. రాజశేఖర్ రాజు, జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ రాంపతినాయక్, తహసిల్దార్ పి.శ్రీనివాస్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కర్నాటి రమేష్, మిర్యాలగూడ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు గౌరు శ్రీనివాస్, బి.వెంకటరమణచౌదరీ, ఉపాధ్యక్షుడు రంగా రంజిత్, బండారు కుశలయ్య, ఇతర అధికారులు ఉన్నారు.

## సంక్షేమ పథకాలపై పూర్తి అవగాహన పెంపొందించుకోవాలి



**తుర్కపల్లి ,మే 12 ప్రభాతసూర్య :** ఒంటరి మహిళలు తమ కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలపై పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని నాబార్డ్ డీడీఎం ఝూన్సీ అన్నారు. మంగళవారం స్వర భారతి రైతు నేస్తం ఒంటరి మహిళ సమైక్య రైతు ఉత్పత్తిదారుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో తుర్కపల్లి మండల కేంద్రంలో జనరల్ బాడీ సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు స్వయం ఉపాధి హార్దిక సాధికారత దిశగా ముందడుగు వేయాలని అన్నారు. సంఘాల ద్వారా కొత్త ఆలోచనలు ప్రాజెక్టులు ప్రతిపాదిస్తే నాబార్డ్ వాటిని సాలుకూలంగా స్పందించి సహకారం అందిస్తుందని అన్నారు. మురళి రాజ్ మాట్లాడుతూ ప్రస్తుత వ్యవసాయంలో పెరుగుతున్న ఖర్చులను దృష్టిలో ఉంచుకొని రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మల్లాల్చిన అవసరం ఉందని అన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా ఉత్పత్తి ఖర్చులు తగ్గి నేల ఆరోగ్యం మెరుగు పడుతుందని దీర్ఘకాలంలో రైతులకు స్థిరమైన ఆదాయం లభిస్తుందని అన్నారు. రైతులకు అవసరమైన సాంకేతిక మార్గదర్శకత్వం అందించడానికి సిద్ధంగా ఉన్నామని అన్నారు పిలుపు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు జనార్దన్ మాట్లాడుతూ సంఘాలు బలోపేతం కావాలంటే సభ్యులు ఆర్థికంగా విద్యాపరంగా ఎదగాల్సిన అవసరం ఉందని అన్నారు. స్వయంపాలన దిశగా సంఘాలు పనిచేస్తే మహిళలు రైతులు సమగ్ర అభివృద్ధి సాధించగలరని అన్నారు. ముఖ్యంగా మహిళా సంఘాలు బలపడడం ద్వారా గ్రామీణ సమాజంలో సామాజిక ఆర్థిక మార్పులు తీసుకురావచ్చు అని అన్నారు. రైతు స్వరాజ వేదిక నాయకులు, కొండల్ రెడ్డి మాట్లాడుతూ రైతులతోపాటు రైతు కూలీలు కౌలు రైతుల సమస్యలపై కూడా సంఘాలు దృష్టి పెట్టాలని అన్నారు కవులు రైతులకు గుర్తింపు సామాజిక భద్రత పెన్షన్ సదుపాయాలు కుటుంబ ప్రయోజన పథకాలు అందేలా ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రజా సంఘాలు ఈ అంశంపై చర్చించి చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పిలుపు సంస్థ సిబ్బంది ,మహిళలు పాల్గొన్నారు

## రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు



**తుర్కపల్లి ,మే 12 ప్రభాతసూర్య:** తుర్కపల్లి మండలం గంధ మల్ల గ్రామంలోని గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం వారు రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు రానున్న వాన కాలం సాగుకు సంబంధించిన వ్యవసాయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు . ఈ సందర్భంగా సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ కే మధుబాబు మాట్లాడుతూ రసాయనిక ఎరువులను మోతాదుకు మించి వాడకూడదని సేంద్రీయ ఎరువులను తప్పకుండా వాడడం అలవర్చుకోవాలని అన్నారు. విత్తనాలు ఎరువులు పురుగుల మందుల రసీదులను భద్రపరుచుకోవాలని అన్నారు. సాగు నీటిని వృధా చేయకుండా చూడాలని, వరిలో రైతులు వరి విత్తనాన్ని వారే తయారు చేసుకోవచ్చని తెలిపారు. చెట్లు భూగర్భ జలాల నిలువ నీటి వనరులను నిర్వహించడంలో కీలక పాత్ర పోషిస్తాయని ,కాబట్టి చెట్లను నాటాలని వివరించారు .వరిలో గట్ల నిండా నీరు పెట్టి సాగు చేయడం వలన దిగుబడులు తక్కువ అవుతాయని అనవసర నీటి వినియోగం వృధా ఖర్చు నష్టం అని వివరించారు .పురుగుమందులను విచక్షణతో వాడి ఆరోగ్యంలో పురుగుమందు అవశేషాలు లేకుండా చూడాలన్నారు. అనవసర రసాయన ఎరువులు వాడడం తగ్గించి భూమి ఆరోగ్యాన్ని పరిరక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ బి భారతి, ప్రధాన శాస్త్రవేత్త రాకేష్, వ్యవసాయ విస్తరణ అధికారి తిరుమలరావు, ఉపసర్పంచ్ బాలరాజు, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు జింకల ఎల్లేష్ యాదవ్, కనకయ్య, గణేష్, నరసింహులు, బిక్షపతి, వెంకటేశం, ముత్యాలు, నరసింహులు, కనకయ్య, పద్మ, లక్ష్మి, రైతులు పాల్గొన్నారు



## శ్రీ ఆభయాంజనేయ స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే బిఎల్ఆర్ దంపతులు

**మిర్యాలగూడ మే 12:-( ప్రభాత సూర్య):** శ్రీ హనుమాన్ జయంతి సందర్భంగా మంగళవారం మిర్యాలగూడ పట్టణంలోని శ్రీ ఆభయాంజనేయ స్వామి దేవాలయంలో సతీసమేతంగా దర్శించుకున్న శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్ మాధవి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం భక్తులకు అన్నప్రసాధ వితరణ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ చిలుకూరి సుధా బాలకృష్ణ, వైస్ చైర్మన్ గుడిపాటి శిరీష నవీన్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మిట్టపల్లి వెంకటేష్, కాంగ్రెస్ నాయకులు షేక్ అబ్దుల్లా, ఇతర నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

## ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు....



**కొండాపూర్ ప్రభాత సూర్య:** హనుమాన్ జయంతి పర్వదినాన్ని పురస్కరించుకొని మంగళవారం రోజు కొండాపూర్ శ్రీ రామ్ నగర్ లో శ్రీ రామ్ నగర్ యూత్ ఆధ్వర్యంలో శ్రీ హనుమాన్ జయంతి అత్యంత వైభవంగా నిర్వహించారు. కాలనీ వాసులు, యువత, మహిళలు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని భక్తి భావంతో హనుమాన్ జయంతి నిర్వహించి శ్రీ ఆంజనేయ స్వామివారి కృపాకటాక్షాలను పొందారు.

## ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

### ప్రతి శనివారం హనుమాన్ చాలీసా పారాయణాన్ని వినాలి



**మియాపూర్ ప్రభాత సూర్య:** హనుమాన్ జయంతి పర్వదినాన్ని పురస్కరించుకొని మంగళవారం రోజు మియాపూర్ మక్త మహబూబ్‌పేట్ హనుమాన్ టెంపుల్‌లో నిర్వహించిన శ్రీ హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమం భక్తుల గోవింద నామస్మరణలతో అత్యంత వైభవంగా నిర్వహించారుకాలనీ వాసులు, యువత, మహిళలు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని భక్తి భావంతో పారాయణం నిర్వహించి శ్రీ ఆంజనేయ స్వామివారి కృపాకటాక్షాలను పొందారు.సంకటమోచనుడు శ్రీ ఆంజనేయ స్వామివారి ఆశీస్సులు ప్రతి ఇంటిపై ఉండాలని అలాగే ప్రతి శనివారం సాయంత్రం హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించబడుతుందని, కావున భక్తులందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ నాయకులు, గ్రామస్తులు కోరారు..

## ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాలి

**మిర్యాలగూడ, మే 12:-( ప్రభాత సూర్య):** భూగర్భజలాలు ప్రతి ఇంట్లో పెంపుకు ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని మిర్యాలగూడ ఎంపిడిఓ ఎం. శేషగిరి శర్మ కోరారు. మంగళవారం సంచాయ్ జన భాగీదారి కళాజాత బృందం మిర్యాలగూడ మండలం తుంగపహాడ్, శ్రీనివాస నగర్ గ్రామపంచాయతీలలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామిణ ఉపాధి పథకం ఎపీడి బాలకృష్ణ , ఎపిఎం దిలీప్ లు ఆటపాటలతో గ్రామాలలో భూగర్భ జల మట్టం పెంచుటకు వర్షపు నీటిని ఒడిసి పట్టాలని, ప్రతి ఇంట ఇంకుడు గుంతలు తవ్వించాలని గ్రామాలలో మురుగు కాలువలకు చివరన డ్రైన్ ఎండ్ సోక్ పిట్ నిర్మించాలని ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామాలలో పచ్చదనం పెంపొందించుటకు ప్రతి ఇంటిలో 6 మొక్కలు నాటాలని అందువల్ల పర్యావరణం కాపాడబడుతుందని ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శులు వినయ్, శ్రీకాంత్ రెడ్డి, ఎపిఓ సురనాయక్, ఇసి బి.కళావతి, టెక్నికల్ అసిస్టెంట్లు రేణుక, లాలు, ఫీల్డ్ అసిస్టెంట్ సంపంగి శ్రీనివాస్ లు పాల్గొన్నారు.





## నీట్ పరీక్ష పేపర్ (యూజీ 2026) లీక్ చేసి లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు నాశనం చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

### బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ డిమాండ్

**ప్రభాత సూర్య మాడుగుల పల్లి (మే 12)ప్రతినిధి :** డాక్టర్ కావాలనే ఆశతో మే 3న లక్షలాది మంది విద్యార్థులు నీట్ పరీక్షలు రాశారని ఇప్పుడు ఆ పేపర్ లీక్ వల్ల పరీక్షలు రద్దు చేస్తున్నామని జాతీయ పరీక్ష సంస్థ ప్రకటించడంతో లక్షలాది మంది విద్యార్థుల బాధ వర్ణనాతీతం అని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ అన్నారు.రాజస్థాన్ లో జరిగిన పేపర్ లీకేజీ నిర్వాహకులను కఠినంగా శిక్షించాలని నినాదాలు చేస్తూ అమరవీరుల స్తూపం ఫ్లకార్డులతో ప్రదర్శన నిర్వహించారు.ఈ సందర్భంగా లింగంగౌడ్ మాట్లాడుతూ అత్యంత కట్టుదిట్టమైన పహారాలో ఉండాల్సిన పత్రాలు ఈ విధంగా సంతలో కూరగాయలు దొరికినట్లు పేపర్లు చేతులు మారడం చాలా బాధాకరమైన విషయం అన్నారు.ఎన్నో ఆశలతో వేలకు వేల రూపాయలు ఖర్చుపెట్టి హాస్టల్లో ఉంటూ కోచింగ్ లు తీసుకొని రాత్రింబవళ్లు కష్టపడి చదివిన విద్యార్థుల శ్రమ వృధా అయినట్టేనని అన్నారు.పేపర్ లీకేజీ వ్యవహారాన్ని సిబిఐ చేత ఎంక్వయిరీ చేయించాలన్నారు.ఈ కార్యక్రమంలో బంటు వెంకటేశ్వర్లు రాంబాబు,లవన్ కుమార్ వెంకటయ్య,సతీషు వెంకటేష్ నవీన్ సందీప్ ప్రదీప్ గౌతమ్ శిల్ప అశ్విని స్వాతి లావణ్య సునీత సరస్వతి కుమారి మౌనిక వెన్నెల తదితరులు పాల్గొన్నారు.

## రువుల గోదాములు, దుకాణాలు తనిఖీ చేసిన ఇంచార్జి ఎడిఎ ఋష్యేంద్రమణి



**మిర్యాలగూడ , మే 12:-( ప్రభాత సూర్య):** మిర్యాలగూడ వ్యవసాయ శాఖ డివిజన్ పరిధిలో ఎరువులు, క్రిమిసంహారక మందులు, విత్తనాలు ఎమ్మార్పి ధరలకు విక్రయించాలని ఇంచార్జి అసిస్టెంట్ డైరెక్టర్, ఎంఎఓ ఎం. ఋష్యేంద్రమణి హెచ్చరించారు. మంగళవారం పట్టణం మండలంలోని ఎరువుల గోదాములు, దుకాణాలను తనిఖీ చేశారు. నాగార్జున జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ లిమిటెడ్(ఎన్డిసిఎంఎస్) గోదాము, మల్లిఖార్జున ఆగ్రో కెమికల్స్, ప్రాధమిక వ్యవసాయ సహకార సంఘం గోదాముల్లో ఎరువుల నిల్వలను తనిఖీ చేసిన అనంతరం ఆమె మాట్లాడుతూ ఎమ్మార్పి కంటే ఎక్కువకు విక్రాయిస్తే కఠిన చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. ఆయా గోదాముల్లో, దుకాణాల్లో స్టాక్ రిజిస్టర్లు పరిశీలించారు.

## హనుమాన్ జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే జిఎంఆర్



**పటాన్చెరు, మే 12,ప్రభాత సూర్య :** హనుమాన్ జయంతిని పురస్కరించుకొని పటాన్చెరు పట్టణంలోని పంచముఖి హనుమాన్ దేవాలయం, చైతన్య నగర్ హనుమాన్ దేవాలయాల్లో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే ని ఘనంగా సన్మానించారు. నియోజకవర్గ ప్రజలందరికీ హనుమాన్ జయంతి శుభాకాంక్షలు తెలియచేశారు. స్వామి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, కంకర శ్రీనివాస్, ఆయా ఆలయాల కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



## ఆంజనేయ స్వామి ఆశీస్సులతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలి

### హనుమాన్ జయంతి సందర్భంగా దేవాలయాల్లో ప్రత్యేక పూజలు, అన్నదానంలో పాల్గొన్న మాద్రి పృథ్వీరాజ్.





**పటాన్చెరు, మే 12,ప్రభాత సూర్య :** పటాన్చెరు మండలం లోని హనుమాన్ జయంతి సందర్భంగా పటాన్‌చెరు, జేపీ కాలనీ డివిజన్ పరిధిలోని ఆంజనేయ స్వామి దేవాలయాల్లో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో బీఆర్ఎస్ నాయకుడు, ఎండీఆర్ ఫౌండేషన్ సహ వ్యవస్థాపకుడు మాద్రి పృథ్వీరాజ్ పాల్గొన్నారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు స్వయంగా అన్నప్రసాదం వడ్డించారు. కార్యక్రమంలో భక్తులతో ఆత్మీయంగా మమేకమై పండుగ శుభాకాంక్షలు తెలియ జేశారు. ఈ సందర్భంగా మాద్రి పృథ్వీరాజ్ మాట్లాడు తూ, ఆంజనేయ స్వామి కరుణాకటాక్షాలతో పటాన్‌చెరు ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ప్రతి కుటుంబంలో ఆనందం, అభివృద్ధి నెలకొని ప్రజల జీవనంలో శాంతి సమృద్ధిగా ఉండాలని కోరుకున్నారు.హనుమాన్ జయంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

## భద్రకాళి సేవ సమితి ఆధ్వర్యంలో 23వ హనుమాన్ జయంతోత్సవం ఘనంగా నిర్వహణ





### వెయ్యిమందికి అన్నప్రసాద వితరణ

**పటాన్చెరు, మే 12,ప్రభాత సూర్య :** సంగారెడ్డి జిల్లా, పటాన్ చెరువు పట్టణం,భద్రకాళి సేవ సమితి ఆధ్వర్యంలో 23వ హనుమాన్ జయంతోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు, అన్నదాన ప్రసాద వితరణ కార్యక్రమాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. భద్రకాళి సేవ సమితి అధ్యక్షుడు వడ్ల కిట్టు నాయకత్వంలో కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేపట్టి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా సుమారు 800 మంది భక్తులు విచ్చేసి అభయ ఆంజనేయ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, కార్మిక నాయకులు నర్ర బిక్షపతి, గూడెం మధుసూదన్ రెడ్డి, కోల్కూరి రామచంద్రారెడ్డి, మిద్దెల సుధాకర్ గౌడ్, ఎండిఆర్ యువసేన చైర్మన్ మాద్రి పృథ్వీరాజ్ హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా భద్రకాళి సేవా సమితి అధ్యక్షుడు వడ్ల కిట్టు మాట్లాడుతూ.. పటాన్ చెరులోని చెన్నకేశవ స్వామి ఆలయం సుమారు వెయ్యేళ్ల పురాతన చరిత్ర కలిగిన ఆలయమని తెలిపారు. 2004 సంవత్సరంలో హనుమాన్ జయంతి సందర్భంగా పులిహోర ప్రసాద వితరణతో ప్రారంభమైన సేవా కార్యక్రమం స్వామి వారి ఆశీర్వాదంతో ప్రస్తుతం 1000 మందికి అన్న ప్రసాదం అందించే స్థాయికి చేరుకుందని తెలిపారు, చెన్నకేశవ స్వామి, అభయ ఆంజనేయ స్వామివారి ఆశీర్వాదం తమపై ఎల్లప్పుడూ ఉండాలని, భద్రకాళి సేవ సమితి ఆధ్వర్యంలో ఇలాంటి సేవా కార్యక్రమాలను మరెన్నో నిర్వహించే అవకాశం కలగాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నామని అన్నారు. అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు విజయవంతంగా చేయడానికి నాకు సహకరించిన మిత్రులకు పేరుపేరునా హృదయపూర్వక ధన్యవాదాలు, అభయ ఆంజనేయ స్వామివారి ఆశీర్వాదంతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భద్రకాళి సేవ సమితి అధ్యక్షుడు వడ్ల కిట్టుతో పాటు కమిటీ సభ్యులు లక్కదొడ్డి రాములు, బాలరాజు, పవన్ చారి, ఆనంద్ రెడ్డి, హరిశంకర్ చారి, పెద్దబోయిన మాణిక్యం, హర్ష, బబులు, శ్రీరామ్, మాణిక్యం చారి, బంధుమిత్రులు, భక్తులు పాల్గొన్నారు.

## ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు..!

### దేవాలయానికి పోటెత్తిన భక్తులు.. స్వామి వారికి ప్రత్యేక పూజలు

**వేములపల్లి, మే 12 ప్రభాత సూర్య న్యూస్:** మండలంలోని రావులపెంట గ్రామంలో శ్రీ హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.మంగళవారం శ్రీసువర్చల సహిత అభయ ఆంజనేయ స్వామి దేవాలయానికి భక్తులు పోటెత్తారు.వేద పండితులు పద్మనబాశర్మ, దేవాలయ ధర్మకర్తలు కాసర్ల ప్రశాంత,పోలబోయిన చంద్రకళ ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు కార్యక్రమాలు చేశారు. గ్రామ సర్పంచ్ సందరబోయిన చంద్రయ్య- పుష్పలత, మాజీ సర్పంచ్ దొంతిరెడ్డి వెంకట్ రెడ్డి- స్వరూప దంపతులు స్వామి వారి పూజా కార్యక్రమాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం గ్రామంలోని ప్రధాన వీధుల్లో నడుమ స్వామి వారి ఊరేగింపు కమనీయంగా సాగింది. జై శ్రీరామ్ అంటూ దేవాలయ ప్రాంగణంలో మార్మోగించారు.ఈ సందర్భంగా భక్తులకు హనుమాన్ భజన మండలి సభ్యులు తీర్థ ప్రసాదాలు ఏర్పాటు చేసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ పల్లా గోవర్ధన్,భజన మండలి సభ్యురాలు దొంతిరెడ్డి వినోద,శీలం ముత్తమ్మ, ఇంద్ర, గుత్తికొండ నాగలక్ష్మి,వెంకటమ్మ, పిట్టల జయమ్మ, పుష్పలత,సభ్యులు శీలం వినయ్, రాంబాబ,శివ, దినేష్,భక్తులు తదితరులు పాల్గొన్నారు.



## కన్నుల పండగగా తిరుపతమ్మ గోపయ్య ప్రతిష్ఠ మహోత్సవ వేడుకలు

**వేములపల్లి మే 12 ప్రభాత సూర్య న్యూస్:** వేములపల్లి మండల పరిధిలోని ఆమనగల్లు గ్రామంలో నూతనంగా నిర్మించిన తిరుపతమ్మ గోపయ్య, అంకమ్మ తల్లి, నాగులమ్మ తల్లి ఆలయంలో ప్రతిష్ఠ మహోత్సవ వేడుకలు కన్నుల పండుగగా నిర్వహించారు. మంగళవారం గ్రామ వేద పండితులు సూర్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా యాగశాల ప్రవేశం, గోపూజ,అగ్ని ప్రతిష్ఠ,గణపతి హోమం,మూల మంత్ర హోమం, జలాభిషేకం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై వెంకటేశ్వర్లు దేవాలయం నిర్మాణ కర్త ఎలగపల్లి లక్ష్మీ వెంకటేష్ తో కలిసి గణపతి హోమం కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు, పెద్ద ఎత్తున, గ్రామ ప్రజలు భక్తులు పాల్గొన్నారు.



# రైతులకు ఇబ్బందులు సృష్టిస్తే కఠిన చర్యలు..!

## జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ హెచ్చరిక



**వేములపల్లి మే 12 ప్రభాత సూర్య న్యూస్:** జిల్లాలోని రైస్ మిల్లర్లు ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల నుండి వచ్చిన ధాన్యాన్ని దించుకునేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు.అలా కాదని ప్రైవేటు ధాన్యం దించుకునేందుకు ప్రాధాన్యత ఇస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రబీ ధాన్యం సేకరణలో భాగంగా మిల్లుల వద్ద లారీల అన్లోడింగ్ జాప్యం జరుగుతున్నదని వార్తలు వచ్చిన నేపథ్యంలో మంగళవారం అయన జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్ తో కలిసి మిర్యాలగూడలోని వాగ్దేవి రైస్ మిల్, మహేశ్వరి పారా బాయిల్డ్ రైస్ మిల్లులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా వాగ్దేవి రైస్ మిల్లును ఆయన తనిఖీ చేసి మిల్లుకు వచ్చిన ప్రభుత్వ, ప్రైవేటు ధాన్యాన్ని పరిశీలించారు. మిల్లు యజమానితో మాట్లాడుతూ ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల నుండి వచ్చిన దాన్యం పూర్తిగా కొనుగోలు చేసిన తర్వాత ప్రైవేట్ ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఆదేశించారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన దాన్యం లోడు లారీల డ్రైవర్లతో ఆయన మాట్లాడారు. మిల్లుకొచ్చిన లారీలు 12 గంటల్లో అన్లోడ్ చేసుకుని తిరిగి కొనుగోలు కేంద్రాలకు పంపించాలని ఆదేశించారు. అవసరమైతే హమాలీలను ఎక్కువ మందిని ఏర్పాటు చేసుకొని అన్లోడ్ ను పెంచాలన్నారు. రానున్న 10 రోజులు జిల్లాలో ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలని, ప్రత్యేకించి ప్రభుత్వ కేంద్రాల ధాన్యం కొనుగోలును వేగవంతం చేసేందుకు ఇతర ప్రాంతాల నుండి ధాన్యం రాకుండా డిండి, అవంతిపురం తదితర ప్రాంతాలలో చెక్ ఫోస్టులు ఏర్పాటు చేయాలని, వ్యవసాయ ,రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులతో బృందాన్ని ఏర్పాటు చేయాలన్నారు. అలాగే మిల్లుల వద్ద ఒక పోలీస్ కానిస్టేబుల్ తో పాటు, జిపిఓ, ఇతర అధికారులు నిరంతరం ధాన్యం ఆన్లోడ్ పర్యవేక్షించాలని, అందరు రైస్ మిల్లర్లు ఇదే విధానాన్ని పాటించాలని చెప్పారు.అనంతరం మహేశ్వరి పారాబాయిల్డ్ రైస్ మిల్లును ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. కాగా ఈ రైస్ మిల్లులో రైస్ మిల్ గుమాస్తా మాడుగులపల్లి మండలానికి చెందిన ఒక రైతు నుండి డబ్బులు తీసుకున్నాడని ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఆయన అన్ని రికార్డులను పరిశీలించి వచ్చిన ఆరోపణలపై విచారణ నిర్వహించి నివేదిక సమర్పించాలని మాడుగులపల్లి తహసిల్దార్ ను ఆదేశించారు. అంతకు ముందు కలెక్టర్ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ జిల్లాలో రబీ ధాన్యం సేకరణలో భాగంగా ఇప్పటివరకు 4 లక్షల 10 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరిగిందని, ఇంకా రెండు లక్షల అరవై వేల మెట్రిక్ టన్నులు దాన్యం కొనాల్సి ఉందని చెప్పారు.

మిల్లర్లు త్వరత్వరగా ధాన్యాన్ని అన్లోడ్ చేసుకునేందుకుగాను ఎస్పీ తో పాటు,రైస్ మిల్లులను సందర్శిస్తున్నట్లు చెప్పారు.అన్ని రైస్ మిల్లులకు ప్రైవేటు, ప్రభుత్వ దాన్యం వస్తున్నప్పటికీ మిల్లర్లు ప్రైవేట్ ధాన్యానికి ప్రాధాన్యత ఇవ్వకుండా ప్రభుత్వ కేంద్రాల ద్వారా వచ్చిన ధాన్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రభుత్వ ధాన్యం పూర్తిగా కొనుగోలు జరిగిన తర్వాత ప్రైవేట్ ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఆదేశించారు.రైస్ మిల్లులు ఎంత వీలైతే అంత ధాన్యాన్ని అన్లోడ్ చేసుకోవాలని చెప్పారు.ప్రతి మిల్ పాయింట్ వద్ద ఒక అధికారిని, పోలీసును ఏర్పాటు చేస్తున్నామని, వచ్చిన వాహనాలు 12 గంటల్లోపు ధాన్యాన్ని అన్లోడ్ చేసి తిరిగి పిపిసి కేంద్రాలకు వెళ్లిపోయేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించామని, రానున్న పది రోజులు జిల్లాలో ప్రైవేటు వ్యక్తుల నుండి వచ్చిన ధాన్యాన్ని హోల్డ్ లో పెట్టాల్సిందిగా ఆయన అధికారులు,మిల్లర్లను ఆదేశించారు. జిల్లాలో ఇప్పటివరకు 62 శాతం దాన్యాన్ని కొనుగోలు చేశామని, ఇంకా 32 శాతం కొనుగోలు చేయాల్సి ఉందని , ధాన్యం కొనుగోలులో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా కొనుగోలు చేసేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. మిల్లర్లకు సంబంధించి బాయిల్డ్ కోట ఇవ్వడం, మిల్లర్ చార్జీలు ఇవ్వడం వంటివి పూర్తి చేయడం జరిగిందని, అందువల్ల మిల్లర్లు సైతం పూర్తిస్థాయిలోప్రభుత్వానికి ,రైతులకు సహకరించాలని కోరారు. క్షేత్రస్థాయిలో ధాన్యం కొనుగోలును ఎప్పటికప్పుడు పర్యవేక్షించి రైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తామని ఈ సందర్భంగా కలెక్టర్ వెల్లడించారు.జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్ మాట్లాడుతూ... మిల్లర్లు మిల్ పాయింట్ కి వచ్చిన వాహనాలను 12 గంటల్లో అన్లోడ్ చేసుకోవాలని,అన్లోడ్ చేసుకోవడంలో ఇబ్బందులు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, పోలీస్ తరఫున మిల్లులో ఒక కానిస్టేబుల్ ను ఏర్పాటు చేస్తామని, ప్రభుత్వ ధాన్యాన్ని దించుకునేందుకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు.మిర్యాలగూడ ఆర్డీవో రమణారెడ్డి, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ రాంపతి నాయక్,డిఎస్ఓ వెంకటేశం,తహసిల్దార్ శ్రీనివాస్, ఇతర అధికారులు, తదితరులు ఉన్నారు.




## ఖమ్మం జిల్లా వాసి మంద సంజీవరావు కు ఈనెల 16న గోవాలో ఇంటర్నేషనల్ అవార్డుకు ఆహ్వానం

**ఖమ్మం ( ప్రభాత సూర్య ప్రతినిధి ):** ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ఫెడరేషన్ అవార్డుకు ఎంపిక చేయబడిన మన ఖమ్మం జిల్లా వాసి మంచుకొండ గ్రామం రఘునాథపాలెం మండలం మంద సంజీవరావు కి ఈనెల 16న గోవాలో ఇంటర్నేషనల్ పోగ్రామ్ జరుగుతుంది.ఆ కార్యక్రమానికి ఎన్నో అవార్డులు తీసుకున్న మన జిల్లా వాసి అయిన ఎస్ ఎస్ బి ఎం మహాసేన ఖమ్మం జిల్లా అధ్యక్షులు మంద సంజీవరావు కి ఉమెన్స్ ఇంటర్నేషనల్ అవార్డు ఇవ్వటం ఎంతో గర్వకారంగా భావిస్తూ తెలియజేస్తున్నానని తెలిపారు.

## ఘనంగా ఇరుముడి కార్యక్రమం వేడుకలు



**పెబ్బేరు . మే 12 ప్రభాత సూర్య:** మద్దిమడుగు గురు స్వామి జయరాం పీఠాధిపతి ఆధ్వర్యంలో పెబ్బేరు నుండి 8 మంది కన్యస్వాములు హనుమాన్ మాలధారణ వేసి 41 రోజు మండలం దీక్ష పూర్తి చేసుకుని వైశాఖ బహుళదశమి హనుమాన్ జన్మదినోత్సవం సందర్భంగా కన్నె స్వాములు. వీరంపేట ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి లక్ష్మి కాంతాచార్యులు ఆధ్వర్యంలో ఇరుముడి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం. గౌని వేమారెడ్డి. స్వామి. కంచ ఆంజనేయులు స్వామి. జల్లీ పవన్ స్వామి. శ్రేయన్ స్వామి ప్రజ్ఞ స్వామి. సిసిరస్వామి. త్రీయను సామి . లోహిత్ స్వామి. ఇరుముడి ఎత్తుకొని ఎదుల హనుమాన్ టెంపుల్ ఆంజనేయ స్వామి వారికి ఇరుముడులు సమర్పించారు.

## నీట్ పేరుతో విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న బీజేపీ ప్రభుత్వం

### తెలంగాణ ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర నాయకుడు గొల్ల జాన్ ఘాటు హెచ్చరిక



**కూకట్ పల్లి, మే 12 (ప్రభాత సూర్య)** : గత 10 ఏళ్లలో ప్రశ్నాపత్రాలు లీక్ అవ్వడం ఇది 89వ సారి..! అయినా కేంద్రంలోని మోదీ ప్రభుత్వం సిగ్గు లేకుండా విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడుతోంది. పరీక్షలు నిర్వహించలేని ఎన్ టి ఏ వెంటనే రద్దు చేయాలి" అని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర నాయకుడు గొల్ల జాన్ ఫైర్ అయ్యారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గొల్ల జాన్ మాట్లాడుతూ వన్ నేషన్ – వన్ ఎలక్షన్' అంటూ దేశాన్ని మభ్యపెడుతున్న బీజేపీకి... 'వన్ నేషన్ – వన్ ఎగ్జామ్' కూడా సక్రమంగా నిర్వహించే సామర్థ్యం లేదు. విద్యార్థుల కన్నీళ్లు, తల్లిదండ్రుల కష్టాలు ఈ ప్రభుత్వానికి కనిపించడం లేదు" అని ఆయన మండిపడ్డారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నీట్ స్కామ్ వెనుక ఉన్న వారిని కాపాడితే దేశ యువత మిమ్మల్ని క్షమించదు. డబ్బున్న వాళ్లకే సీట్లు, పేద విద్యార్థులకు అన్యాయం.. ఇదే బీజేపీ విద్యా విధానం" అంటూ తీవ్ర స్థాయిలో విమర్శించారు. ప్రధాని నరేంద్ర మోదీ ఇప్పటికైనా స్పందించాలి. లేదంటే విద్యార్థుల ఆగ్రహం దేశవ్యాప్తంగా ఉద్యమంగా మారుతుంది" అని గొల్ల జాన్ హెచ్చరించారు.

# పేదల ఆరోగ్యానికి ఎంత ఖర్చయినా భరిస్తాం: కె ఎల్ ఆర్ బరోసా

### సి ఎం ఆర్ ఎఫ్ చెక్కులతో రోగుల కుటుంబాలకు ఆర్థిక సహాయం

### ప్రభుత్వానికి భారమైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెనకడుగు వేయరు --- కె ఎల్ ఆం





**మహేశ్వరం ప్రతినిధి (ప్రభాత సూర్య):** పేదల ఆరోగ్యానికి భద్రతగా ముఖ్యమంత్రి సహాయనిధి నిలుస్తుందని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు.మంగళ వారం తుక్కుగూడ కార్యాలయంలో 50 మందికి సి ఎం ఆర్ ఎఫ్ చెక్కులను రోగులు, వారి బంధువులకు అందజేశారు.ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ... ఆరోగ్యశ్రీ ద్వారా రూ.10 లక్షల వరకు ఉచిత కార్పొరేట్ వైద్యం అందిస్తున్నామని చెప్పారు. అత్యవసర పరిస్థితుల్లో పేద, మధ్య తరగతి ప్రజలు వైద్య చికిత్స తీసుకున్నా... సి ఎం ఆర్ ఎఫ్ తో కొంత ఆర్థిక చేయూత అందిస్తున్నామని కె ఎల్ ఆర్ తెలిపారు.తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వానికి ఆర్థిక భారమైన పేదల వైద్యానికి ఎంత ఖర్చయినా... భరించేందుకు సీఎం రేవంత్ రెడ్డి సిద్ధంగా ఉన్నారని కిచ్చెన్నగారు గుర్తు చేశారు.పేద, మధ్య తరగతి కుటుంబాలకు పార్టీలకు అతీతంగా సీఎం రిలీఫ్ ఫండ్ అందించటం సంతోషమని కాంగ్రెస్ నేతలు, రోగుల కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ప్రత్యేక డెస్క్ పెట్టి సి ఎం ఆర్ ఎఫ్ చెక్కులు అందించేందుకు కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి కృషి చేస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ నేతలు, రోగులు, వారి బంధువులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ ముఖ్యనేతలతో కెసిఆర్ భేటీ

## పార్టీ సంస్థాగత నిర్మాణంపై ప్రధానంగా దృష్టి

గజ్వెల్: బీఆర్ఎస్ ముఖ్య నేతలతో పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ భేటీ దాదాపు ఆరు గంటలుగా కొనసాగింది. ఎర్రవల్లి ఫామ్ హౌస్‌లో కేసీఆర్ వివిధ అంశాలపై పార్టీ నేతలతో సుదీర్ఘంగా చర్చించారు. ప్రధానంగా పార్టీ సంస్థాగత నిర్మాణం, సభ్యత్వ నమోదు ప్రక్రియ, పార్టీ ఇన్‌ఛార్జ్‌ల నియామకం సహా పార్టీ బలోపేతం వంటి ముఖ్యమైన విషయాలపై కేసీఆర్ అధ్యక్షతన చర్చ జరిగినట్లు సమాచారం. ఈ సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సహా పార్టీ ప్రధాన కార్యదర్శులు, మండలి, శాసనసభా పక్షాల ఉపనాయకులు పాల్గొన్నారు. అలాగే అసెంబ్లీ డిప్యూటీ ఎ÷–లోర్ లీడర్లు హరీశ్ రావు, సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, శాసన మండలి ఫ్లోర్ లీడర్ సిరికొండ మధుసూదనాచారి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్లు ఎల్.రమణ, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి ఉన్నారు. ఈ సందర్భంగా ఇప్పటి వరకు ఉన్న గ్రామ, మండల, జిల్లా స్థాయి కమిటీల రద్దుపైనా సుదీర్ఘ చర్చ కొనసాగినట్లు తెలుస్తోంది. ఈ కమిటీల స్థానంలో కొత్త కమిటీలను ఎన్నుకోవాలని కేసీఆర్ ఆదేశించినట్లు సమాచారం. కమిటీల్లో పార్టీ కోసం కష్టపడి పని చేసే యువతకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. రానున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ, జీహెచ్ఎంసీ ఎన్నికలపైనా నేతలతో కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. మరోవైపు ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల తెలంగాణ పర్యటనపైనా కేసీఆర్ ఆరా తీస్తున్నట్లు సమాచారం. బండి సంజయ్ కుమారుడి కేసు వ్యవహారం కూడా చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది. ఈ అంశం గురించి కేసీఆర్‌కు బీఆర్ఎస్ నేత ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ వివరించినట్లు సమాచారం. కొత్తగా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంపైనా బీఆర్ఎస్ నేతలతో కేసీఆర్ చర్చించారు. అలాగే ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై బలంగా పోరాటాలు చేయాలని నేతలను కేసీఆర్ ఆదేశించినట్లు తెలుస్తోంది. ప్రధానంగా పార్టీ బలోపేతం, కొత్త కమిటీల నియామకంపై దృష్టి సారించారు.

# పంచాయితీరాజ్‌కు మరోమారు గుర్తింపు

## చిత్తూరు జిల్లాకు రెండు జాతీయ అవార్డులు

అమరావతి: ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మరోసారి జాతీయ స్థాయిలో ప్రతిష్ఠాత్మక గుర్తింపు పొందింది. వివిధ విభాగాల్లో రాష్ట్రంలోని గ్రామాలు, సంస్థలు జాతీయ అవార్డులను సొంతం చేసుకుని రాష్ట్రానికి గౌరవం తీసుకువచ్చాయి. చిత్తూరు జిల్లాకు రెండు జాతీయ అవార్డులు దక్కాయి. క్లమేట్ యాక్షన్ విభాగంలో చిత్తూరు జిల్లాలోని కందులవారిప్లలె గ్రామానికి జాతీయ అవార్డు లభించింది. పర్యావరణ పరిరక్షణ, వాతావరణ మార్పులపై గ్రామస్థాయిలో చేపట్టిన చర్యలకు గుర్తింపుగా ఈ అవార్డు దక్కింది. అదేవిధంగా ఆత్మనిర్భర్ విభాగంలో చిత్తూరు జిల్లాలోని ప్రముఖ గ్రామమైన కాణిపాకం జాతీయ అవార్డు సాధించింది. గ్రామాభివృద్ధి, స్వయం సమృద్ధి కార్యక్రమాల అమల్లో కాణిపాకం చూపిన ప్రతిభకు ఈ గుర్తింపు లభించింది. సంస్థల విభాగంలో చిత్తూరు జిల్లా పంచాయతీ రిసోర్స్ సెంటర్‌కు కూడా జాతీయ అవార్డు దక్కింది. గ్రామీణాభివృద్ధి కార్యక్రమాల సమర్థవంతమైన అమలు, స్థానిక సంస్థలకు అందిస్తున్న సేవలకు గుర్తింపుగా ఈ అవార్డు ప్రకటించారు. కూటమి ప్రభుత్వ హయాంలో కేవలం 23 నెలల వ్యవధిలోనే ఆంధ్రప్రదేశ్ 19 జాతీయ అవార్డులు సాధించడం విశేషంగా నిలిచింది. గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతం, పారదర్శక పాలనలో ఏపీ ముందంజలో ఉందని అధికారులు పేర్కొంటున్నారు. ఒకేరోజు అత్యధిక గ్రామసభలను నిర్వహించి ఆంధ్రప్రదేశ్ జాతీయ స్థాయిలో రికార్డు సృష్టించింది. గ్రామస్థాయిలో ప్రజాపాలనను బలోపేతం చేయడం, ప్రజల భాగస్వామ్యాన్ని పెంచడం లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన చర్యలకు ఇది నిదర్శనంగా నిలిచింది.పంచాయతీరాజ్ వ్యవస్థను మరింత బలోపేతం చేయడం, గ్రామాల్లో మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేయడం, ప్రజల భాగస్వామ్యంతో పాలన అందించడం వంటి అంశాలపై చంద్రబాబు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది.



# కోర్టుకు హాజరు కావాలంటూ కవితకు నోటీసులు

**బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్‌తో రైల్ రోకో**

**కవితపై కేసు నమోదు చేసిన రైల్వే పోలీసులు**

**విచారణకు రావాలంటూ సికింద్రాబాద్‌లోని సెకండ్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టు సమన్లు**

తెలంగాణ రాజకీయాల్లో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే ప్రధాన డిమాండ్‌తో కామారెడ్డిలో రైల్‌రోకో నిర్వహించిన తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవితపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు. రైళ్ల రాకపోకలకు అంతరాయం కలిగించడం, నిబంధనలను ఉల్లంఘించడం వంటి కారణాలతో ఆమెతో పాటు మరో 12 మందిపై రైల్వే యాక్ట్‌లోని యూ/సెక్షన్ 147, 74(ఏ) కింద కేసులు నమోదయ్యాయి. ఈ కేసు విచారణలో భాగంగా సికింద్రాబాద్‌లోని సెకండ్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టు కవితకు సమన్లు జారీ చేసింది. రేపు ఉదయం 10.30 గంటలకు వ్యక్తిగతంగా కోర్టుకు హాజరు కావాలని న్యాయస్థానం ఆదేశించింది.

## పెండింగ్ డబుల్ బెడ్రూం ఇళ్లను లబ్ధిదారులకు ఇచ్చేందుకు స్పెషల్ డ్రైవ్: మంత్రి పొంగులేటి



హైదరాబాద్‌లో ఇళ్ళ స్థలాలు ఉంటే ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామన్న మంత్రిజూన్ 2న ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత పంపిణీ ప్రారంభిస్తామని వెల్లడివిధివిధా నాలను ఈ నెల 21న ఖరారు చేస్తామన్న మంత్రిపెండింగ్‌లో ఉన్న డబుల్ బెడ్రూం ఇళ్లను లబ్ధిదారులకు ఇచ్చేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామని తెలంగాణ రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ నగరంలో స్థలాలు ఉన్నవారికి ఈ నెలాఖరులోపు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. జూన్ 2న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ళ రెండో రెండో విడత పంపిణీ ప్రారంభిస్తామని తెలిపారు.రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆదిలాబాద్‌లో ప్రారంభిస్తామని మంత్రి వెల్లడించారు. రెండో విడతకు సంబంధించిన విధివిధానాలను ఈ నెల 21న ఖరారు చేస్తామని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ళ కోసం స్థలాలను గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. హైదరాబాద్‌లో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా కఠినంగా వ్యవహరిస్తామని మంత్రి తెలిపారు.

## తెలంగాణలో కొండెక్కిన కోడి.. భారీగా పెరిగిన చికెన్ ధరలు

**వడగాడ్పుల కారణంగా తీవ్రంగా దెబ్బతిన్న పౌల్ట్రీ రంగం**

**పది రోజుల్లోనే కిలోకు రూ.100 వరకు పెరిగిన ధర**

**ప్రస్తుతం స్కిన్‌లెస్ చికెన్ కిలో రూ.350 నుంచి రూ.370**



తెలంగాణలో మాంసం ప్రియులకు చికెన్ ధరలు చుక్కలు చూపిస్తున్నాయి. గత పది రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా ఎండల తీవ్రత పెరగడంతో కోడి మాంసం ధరలు అమాంతం ఆకాశాన్నంటాయి. కేవలం పది రోజుల వ్యవధిలోనే కిలో చికెన్‌పై దాదాపు రూ.100 వరకు ధర పెరగడం వినియోగదారులను ఆందోళనకు గురిచేస్తోంది. వారం క్రితం వరకు రూ.240కి లభించిన స్కిన్‌లెస్ చికెన్, ప్రస్తుతం హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో రూ.350 నుంచి రూ.370 వరకు పలుకుతోంది. దీంతో కిలో కొనాలనుకునే సామాన్యులు అరకిలోతోనే సరిపెట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.రాష్ట్రంలో 45 డిగ్రీలకు పైగా నమోదవుతున్న ఉష్ణోగ్రతలు పౌల్ట్రీ రంగంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. తీవ్రమైన వడగాడ్పుల కారణంగా ఫారాల్లోని కోళ్లు ఒత్తిడికి గురవుతూ ఆహారం సరిగ్గా తీసుకోవడం లేదని, వేడిని తట్టుకోలేక పెద్ద సంఖ్యలో మృత్యువాత పడుతున్నాయని పౌల్ట్రీ ఫారాల యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోళ్ల మరణాల వల్ల మార్కెట్‌కు సరఫరా సగానికి పైగా పడిపోయింది. సాధారణంగా వేసవిలో వినియోగం తక్కువగా ఉన్నప్పటికీ, ఈసారి డిమాండ్‌కు తగిన సరఫరా లేకపోవడంతో ధరలు అదుపు తప్పాయి.ఈ ధరల పెరుగుదలకు కేవలం ఎండలే కాకుండా పెరిగిన దాణా ఖర్చులు, రవాణా వ్యయం కూడా అదనపు భారంగా మారాయి. వేసవిలో కోళ్లను సురక్షితంగా తరలించేందుకు ప్రత్యేక శీతలీకరణ ఏర్పాట్లు చేయాల్సి రావడం రిటైల్ వ్యాపారులపై మరింత భారం మోపుతోంది. ఈ పరిణామాల నేపథ్యంలో, రాబోయే రోజుల్లో ఎండల తీవ్రత కొనసాగితే చికెన్ ధర కిలో రూ.400 మార్కును తాకినా ఆశ్చర్యపోనవసరం లేదని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.చికెన్ ధరలు పెరగడంతో చాలా మంది వినియోగదారులు మటన్, చేపల వంటి ప్రత్యామ్నాయాల వైపు మొగ్గు చూపుతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో మటన్ కిలో రూ.800 నుంచి రూ.1000 మధ్య విక్రయిస్తుండగా, బొచ్చ, రవ్వ వంటి చేపలు కిలో రూ.200, కొర్రమీను వంటివి రూ.300 వరకు అమ్ముతున్నారు.

## హైదరాబాద్‌లో బాలుడిపై వీధికుక్కల దాడి.. పరిస్థితి విషమం

**ఆడుకుంటుండగా విరుచుకుపడిన 10 శునకాలు**

**తలకు తీవ్ర గాయాలు, విషమంగా బాలుడి పరిస్థితి**

**అధికారులు పట్టించుకోవడం లేదంటున్న స్థానికులు**



హైదరాబాద్ నగరంలో వీధికుక్కలు మరోసారి బీభత్సం సృష్టించాయి. ఇంటి బయట ఆడుకుంటున్న ఓ చిన్నారిపై సుమారు 10 వీధికుక్కలు మూకుమ్మడిగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. ప్రస్తుతం బాలుడి పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్టు సమాచారం. ఈ దారుణ ఘటన బీఎన్ రెడ్డి నగర్ సమీపంలోని టీచర్స్ కాలనీలో సోమవారం చోటుచేసుకుంది.వివరాల్లోకి వెళితే... సిద్దిపేటకు చెందిన ఆద్విక్ అనే బాలుడు వేసవి సెలవుల కోసం టీచర్స్ కాలనీలో ఉంటున్న బంధువుల ఇంటికి వచ్చాడు. సోమవారం ఇంటి సెల్లార్‌లో ఆడుకుంటుండగా, ఒక్కసారిగా 10 వీధికుక్కలు అతడిపై విరుచుకుపడ్డాయి. బాలుడి అరుపులు విన్న స్థానికులు వెంటనే అక్కడికి పరుగెత్తుకొచ్చి కుక్కలను తరిమికొట్టారు.అయితే, అప్పటికే కుక్కలు బాలుడి శరీరంపై తీవ్ర గాయాలు చేశాయి. ఈ దాడిలో బాలుడి తలపై చర్మం ఊడిపోయిందని, తీవ్ర రక్తస్రావం అయిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. కుటుంబసభ్యులు వెంటనే చిన్నారిని సమీపంలోని కామినేని ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆద్విక్ పరిస్థితి విషమంగా ఉందని, వైద్యులు చికిత్స అందిస్తున్నారని తెలిసింది. ఈ ఘటనతో కాలనీవాసులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. వీధికుక్కల సమస్యపై అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, వారి నిర్లక్ష్యం వల్లే ఈ దారుణం జరిగిందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## చెరువులు, సరస్సులు, వెట్‌ల్యాండ్స్ పరిరక్షణ

**ప్రత్యేక దృష్టి సారించిన తెలంగాణ ప్రభుత్వం**

**అధికారులతో మంత్రి కొండా సురేఖ సమీక్ష**




హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో చెరువులు, సరస్సులు, వెట్‌ల్యాండ్స్ పరిరక్షణపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. మంత్రి కొండా సురేఖ అధ్యక్షతన అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖల సమీక్షా సమావేశం మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో నిర్వహించారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర వెట్‌ల్యాండ్స్ అథారిటీ కార్యకలాపాలు, వెట్‌ల్యాండ్స్ కాలుష్య నియంత్రణపై విస్తృతంగా చర్చించారు. రాష్ట్రంలోని చెరువులు, సరస్సుల సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు సమగ్ర వివరాలు సమర్పించారు. ఈ సమావేశానికి అటవీ, రెవెన్యూ, ఇరిగేషన్, ఫిషరీస్ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. రాష్ట్రంలోని చెరువులు, సరస్సుల పునరుద్ధరణ, అభివృద్ధికి కార్యాచరణ ప్రణాళికపై సమీక్షించారు. వెట్‌ల్యాండ్స్ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. చెరువుల ఆక్రమణలను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు మంత్రి దిశానిర్దేశర చేశారు. అక్రమ నిర్మాణాలు, కాలుష్య నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. జీవ వైవిధ్యాన్ని కాపాడేందుకు ప్రత్యేక చర్యలు అవసరమని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. పక్షులు, జలచరాలు, పర్యావరణ సమతుల్యతకు వెట్‌ల్యాండ్స్ కీలకమని తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో వెట్‌ల్యాండ్స్ పాత్ర అత్యంత ముఖ్యమని, వాటి సంరక్షణలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా వెట్‌ల్యాండ్స్ మ్యాపింగ్, మానిటరింగ్ ప్రక్రియపై కూడా సమావేశంలో చర్చించారు. చెరువుల స్థితిగతులు, ఆక్రమణలు, కాలుష్య పరిస్థితులపై నిరంతర పర్యవేక్షించాలని అధికారులు అభిప్రాయపడ్డారు. చెరువుల పునరుద్ధరణకు సంబంధించిన పనులను వేగవంతం చేయాలని మంత్రి ఆదేశించారు.

# హైకోర్టును ఆశ్రయించిన బండి సంజయ్ కుమారుడు

**బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ పై పోక్సో కేసు**

**17 ఏళ్ల బాలికను వేధించాడంటూ కేసు నమోదు**

**కేసు కొట్టివేయాలని కోరుతూ హైకోర్టును ఆశ్రయించిన బండి సంజయ్**




తెలంగాణ రాజకీయాల్లో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ తనపై నమోదైన పోక్సో కేసును సవాలు చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తనపై నమోదైన కేసులో ఎలాంటి వాస్తవం లేదని, ఆ కేసును కొట్టివేయాలని కోరుతూ భగీరథ్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై ఈ నెల 14వ తేదీన (బుధవారం) హైకోర్టు వెకేషన్ బెంచ్‌లో విచారణ జరగనుంది. న్యాయస్థానం ఈ విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది. కేసు వివరాల్లోకి వెళితే... ఒక 17 ఏళ్ల మైనర్ బాలికను భగీరథ్ వేధిస్తున్నాడంటూ ఆ బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మే 8వ తేదీన హైదరాబాద్‌లోని పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో పోక్సో చట్టం కింద కేసు నమోదైంది. అయితే, ఈ ఆరోపణలను భగీరథ్ తరపున వర్గాలు ఖండిస్తున్నాయి. ఇది కావాలని చేస్తున్న కుట్రగా వారు పేర్కొంటున్నారు. మరో ఆసక్తికరమైన మలుపు ఏంటంటే... ఆ బాలిక, ఆమె తల్లి తనను డబ్బు కోసం బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని, బెదిరింపులకు పాల్పడుతున్నారని భగీరథ్ కూడా ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు అదే రోజు (మే 8) కరీంనగర్ పోలీసులు బాలిక, ఆమె తల్లిపై కేసు నమోదు చేశారు. ఈ రెండు కేసుల విచారణ ప్రస్తుతం కొనసాగుతోంది.

## భగీరథ్ కేసులో నా వ్యాఖ్యలు వక్రీకరించారు

**బాధితురాలికి కూడా న్యాయం జరగాలని కోరా**

**మరోమారు వివరణ ఇచ్చిన మంత్రి పొన్నం**

హైదరాబాద్:కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్ కేసులో బాధితురాలికి న్యాయం చేయాలని మాత్రమే తాను మాట్లాడానని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ఈ కేసులో బాధితురాలికి న్యాయం చేసే అంశంపైనే తాను మాట్లాడానని.. తన మాటలను కొంతమంది వక్రీకరించారని పేర్కొన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో మంత్రి పొన్నం మాట్లాడారు. ఈ కేసులో భగీరథ్ విచారణ ఎదుర్కొని తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవాలని తాను అన్నానని ప్రస్తావించారు. ఈ విషయంలో కాంగ్రెస్ కక్షపూరితంగా వ్యవహరిస్తోందని మున్నూరు కాపు సంఘాలు ఆరోపణలు చేశాయని అన్నారు. ఈ కేసులో బాధితురాలు కూడా అదే సామాజిక వర్గమని తాను చెప్పానని ప్రస్తావించారు. తన ఉద్దేశంలో కూడా బాధితురాలికి న్యాయం జరగాలనే తపన మాత్రమే ఉందని అన్నారు. ఇందులో ఎక్కడ కూడా కాంప్రమైజ్ కావాలని తాను మాట్లాడలేదని చెప్పుకొచ్చారు. బాధితురాలికి కాంగ్రెస్ అండగా ఉంటుందని.. వారికి పూర్తిగా మద్దతుగా ఉంటామని స్పష్టం చేశారు. బాధితురాలికి న్యాయం జరిగే వరకు తాను పోరాడతానని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

## రేపు 'చలో మామిళ్లపల్లి'కి వైఎస్సార్‌సీపీ పిలుపు





తాడేపల్లి: మొక్కజొన్న రైతులపై దాడి, అక్రమ కేసులపై వైఎస్సార్‌సీపీ స్పందించింది. మొక్కజొన్న రైతులకు అండగా నిలిచేందుకు రేపు(మే 13, బుధవారం) చలో మామిళ్ళపల్లి కార్యక్రమానికి పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ.. పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర దళారీలకే గ్యాంగ్‌స్టర్‌గా మారారంటూ మండిపడ్డారు. "మొక్కజొన్న రైతులను నిలువునా మోసం చేస్తున్నారు. పంటను దాచుకున్న రైతులపై దాడులు చేయించారు. మామిళ్ళపల్లిలో రైతుల గోదాముపై దాడి చేయటం దారుణం. మొక్కజొన్నకు కేంద్రం రూ.2,400 మద్దతు ధర ప్రకటిస్తే నరేంద్ర మాత్రం రూ.1,652కే కొనుగోలు చేస్తున్నారు. తన సంగం డెయిరీకి అనుబంధ సంస్థల కోసం అతి తక్కువకే కొంటూ రైతులను మోసం చేస్తున్నారు. తనకు మొక్కజొన్న అమ్మకపోతే దాడులు చేయిస్తారా?. టీడీపీ మండల స్థాయి నేతలే ఈ దాడుల్లో పాల్గొన్నారు. అది నా గోదామని ధూళిపాళ్ళ అబద్దాలు చెప్తే అధికారులే నమ్మలేదు. దాడులు చేసిన 31 మంది టీడీపీ నేతలపై కేసులు కూడా పెట్టారు. దీంతో ఎమ్మెల్యే నరేంద్ర మైండ్ బ్లాంక్ అయింది. ..అధికారుల మీద ఒత్తిడి చేసి ప్రతీకారంగా మా వారిపై ఎస్సీ, ఎస్టీ కేసులు పెట్టించారు. మొక్కజొన్న దాచుకున్న ఐదుగురు రైతులు సహా మొత్తం 15 మంది రైతులపై కేసులు పెట్టించారు. కర్ణాటక, తెలంగాణలో మొక్కజొన్నకు రూ.2400 కొంటుంటే ఏపీలో ఎందుకు కొనటం లేదు?. రైతులు ఆత్మహత్య చేసుకునే పరిస్థితిని తీసుకురావద్దు. అక్రమంగా నిల్వలు ఉంచిన ధూళిపాళ్ళపై డిప్యూటీ సీఎం పవన్ ఎందుకు స్పందించడం లేదు?. అప్పట్లో సీజ్ ద షిప్ అన్నట్టుగా ఇప్పుడు సీజ్ ద సంగం డెయిరీ అని ఎందుకు అనటం లేదు?" అంటూ అంబటి మురళీకృష్ణ దుయ్యబట్టారు.

## ఫీజురీయింబర్స్‌మెంట్‌కు కొత్త రూల్

తెలంగాణలో ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించి పదో తరగతి మార్కుల జాబితా, ఆధార్‌లో పేరు సరిపోలాలి.. లేదంటే దరఖాస్తు ముందుకెళ్లదు. ఈ మేరకు ఫీజుల చెల్లింపు కొత్త విధానంలో తెలంగాణ ప్రభుత్వం సంస్కరణను తీసుకొచ్చింది. తాజా నిర్ణయంతో దాదాపు 20శాతం మంది ఆధార్‌లో మార్పులు చేసుకోవాల్సిన పరిస్థితి ఉందని చెబుతున్నారు. ఒకవేళ తప్పులు ఉంటే ఈ వేసవి సెలవులుముగిసే లోపు సరి చేసుకోవాలని సూచిస్తున్నారు.తెలంగాణ ప్రభుత్వం ఫీజురీయింబర్స్‌మెంట్‌కు సంబంధించి కీలక నిర్ణయం తీసుకుంది. ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించిన దరఖాస్తు ప్రక్రియలో కీలక సంస్కరణను తీసుకొచ్చారు. రాష్ట్రంలో విద్యార్థులు ట్యూషన్ ఫీజ్, స్కాలర్‌షిప్‌ల కోసం దరఖాస్తు చేసుకునే సమయంలో.. పదోతరగతి మెమోలో ఉన్న పేరు.. ఆధార్‌లోని పేరు, ఇంటిపేరు ఒకేలా ఉండాలని ప్రభుత్వం తెలిపింది. ఒకవేళ ఈ రెండు సరిపోలకపోతే విద్యార్థి దరఖాస్తు ప్రాసెస్ చేయరు.. అక్కడే ఆగిపోతోంది. ఈ మేరకు విద్యార్థులు పదో తరగతి హాల్‌టికెట్ నంబర్, డేట్ ఆఫ్ బర్త్ (పుట్టినతేదీ), ఏ సంవత్సరంలో పదోతరగతి పూర్తయ్యింది వంటి వివరాలతో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. విద్యార్థులకు సంబంధించి ఈ వివరాలన్నీ సరిపోలితేనే దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం వస్తుంది.విద్యార్థులు దరఖాస్తు చేసుకునే సమయంలో కులం, ఉపకులం, ఆధార్ నంబరు, విద్యార్థి మొబైల్ నంబరు, యూనివర్సిటీ, జిల్లా, మండలం, కాలేజీ పేరు కూడా నమోదు చేయాల్సి ఉంటుంది. ఈ వివరాల్లో పదోతరగతి మెమోలో, ఆధార్‌లో పేరు సరిపోలితేనే దరఖాస్తు ప్రాసెస్ ప్రారంభమవుతుంది. ఇలా విద్యార్థి దరఖాస్తు చేసుకున్న తర్వాత ఓ ఐడీ వస్తుంది.. అప్పుడు ఫీజు రీయింబర్స్‌మెంట్ దరఖాస్తు తొలివిడత పూర్తవుతుంది. అలాగే రెన్యువల్ విద్యార్థుల ఆధార్, పదోతరగతి పేరు సరిపోలాల్సిందే అంటున్నారు అధికారులు. తొలివిడతలో దరఖాస్తు పూర్తిచేసిన విద్యార్థులు మీసేవ కేంద్రాల్లో ఆధార్ ఆథెంటికేషన్ ప్రాసెస్ పూర్తిచేయాలి. అనంతరం విద్యార్థులు దరఖాస్తులో వివరాలు పూర్తిచేసి, ఆన్‌లైన్లో సమర్పించాల్సి ఉంటుంది.ప్రతి ఏటా రాష్ట్రంలో ట్యూషన్ ఫీజుల కోసం ఏటా 12 లక్షల మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకుంటున్నారు. వీరందరికి ప్రభుత్వం రూ.2400 కోట్ల వరకు చెల్లించాల్సి ఉంటుంది. విద్యార్థులు గతంలో ఆధార్ ధ్రువీకరణ చేస్తే ఫీజు రీయింబర్స్‌మెంట్ మంజూరయ్యేది. తెలంగాణలో జాతీయ ఉపకార వేతనాల విధానం ప్రకారం ప్రభుత్వం కొత్త విధానాన్ని తీసుకొచ్చింది. రాష్ట్రంలో ఎస్సీ విద్యార్థులకు చెల్లిస్తున్నట్లుగా ఎస్టీ, బీసీ, మైనార్టీ, దివ్యాంగ విద్యార్థులకు వారి వ్యక్తిగత బ్యాంకు అకౌంట్‌లలో నేరుగా ట్యూషన్ ఫీజులు, స్కాలర్‌షిప్‌లు జమచేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.కొత్త విధానం ప్రకారం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలంటే దాదాపు 20 శాతం మంది ఆధార్‌లో పేరు సవరించుకోవాల్సిన అవసరం ఉందని చెబుతున్నారు. ఈ వేసవి సెలవులు ముగిసేలోగా.. ఆధార్‌లో పేర్కొన్న పేరు, ఇంటిపేరులో ఏమైనా తప్పులు ఉంటే సరిచేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. 2026-27 విద్యా సంవత్సరంలో ప్రవేశాలు ప్రారంభమయ్యే నాటికి దరఖాస్తు చేసుకోవడానికి సిద్ధంగా ఉండాలని సూచించారు. అంతేకాదు తప్పనిసరిగా ఆధార్ మొబైల్ అనుసంధానం చేసుకోవాలి. ఆధార్ లింక్ చేసి ఉన్న బ్యాంక్ అకౌంట్ కూడా ఉండాలి. విద్యార్థి బ్యాంక్ అకౌంట్‌లో వివరాలు, ఆధార్ నంబర్ తనిఖీ తర్వాతే ఫీజులు మంజూరు చేస్తారు. మంజూరవుతాయి.

# బీఆర్ఎస్ ఖాళీయే లక్ష్యంగా ఆపరేషన్ ఆకర్ష్

తెలంగాణ రాజకీయాల్లో భారతీయ జనతా పార్టీ తన వ్యూహాలకు పదును పెడుతోంది. 2024 పార్లమెంట్ ఎన్నికల్లో అనూహ్యంగా 8 స్థానాలను కైవసం చేసుకుని, ఓట్ల శాతాన్ని భారీగా పెంచుకున్న కమలదళం, ఇప్పుడు మిషన్ 2028 లక్ష్యంగా పావులు కదుపుతోంది. రాష్ట్రంలో కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయ శక్తిగా ఎదగడమే కాకుండా, బీఆర్ఎస్‌ను మూడో స్థానానికి పరిమితం చేసేలా బీజేపీ అగ్రనాయకత్వం పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తోంది. పదేళ్లపాటు చక్రం తిప్పిన బీఆర్ఎస్ ప్రస్తుతం గడ్డు కాలాన్ని ఎదుర్కొంటోంది. అసెంబ్లీ ఓటమి తర్వాత ఆ పార్టీ నుంచి వలసలు కొనసాగుతుండగా, వాటిని తమకు అనుకూలంగా మార్చుకోవడంలో బీజేపీ విఫలమవుతోంది. కానీ ఇప్పుడు రూటు మార్చాలనుకుంటోంది. నియోజకవర్గస్థాయి నేతలు లేకపోవడం ఆ పార్టీకి సమస్యగా మారింది. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని బీఆర్ఎస్ ద్వితీయ శ్రేణి నాయకత్వాన్ని, బలమైన కేడర్‌ను ఆకర్షించడం ద్వారా పార్టీని బలోపేతం చేయాలని డిసైడయింది. బీఆర్ఎస్ రాజకీయ ఉనికి ముగిసింది అనే సంకేతాలను ప్రజల్లోకి బలంగా పంపడం ద్వారా, ఆ పార్టీ ఓటు బ్యాంకును తమవైపు తిప్పుకోవాలని బీజేపీ భావిస్తోంది.బీజేపీ రాష్ట్ర రాజకీయాల్లో కీలక నేతలుగా ఉన్న ఈటల రాజేందర్ ,కేంద్ర మంత్రి బండి సంజయ్ భిన్నమైన వ్యూహాలతో పనిచేస్తున్నారు. బీఆర్ఎస్ అంతర్గత పరిణామాలు తెలిసిన ఈటల, ఆ పార్టీలోని అసంతృప్త నేతలతో టచ్‌లో ఉంటూ ఆపరేషన్ ఆకర్ష్ ను పర్యవేక్షిస్తుండగా.. బండి సంజయ్ తనదైన శైలిలో హిందూత్వ ఎజెండా, యువతను ఆకట్టుకునేలా క్షేత్రస్థాయి పర్యటనలు చేస్తున్నారు. సంస్థాగతంగా బలంగా ఉన్న ప్రాంతాల్లో పట్టు నిలుపుకుంటూనే, బలహీనంగా ఉన్న దక్షిణ తెలంగాణలో పార్టీని విస్తరించడమే వీరిద్దరి ప్రధాన లక్ష్యం.రాష్ట్రంలో ఇప్పుడు రాజకీయాలు క్రమంగా ద్విపాక్షికంగా మారుతున్నాయి. ఒకప్పుడు బీఆర్ఎస్ వర్సెస్ కాంగ్రెస్ అన్నట్లుగా ఉన్న పోరు, ఇప్పుడు కాంగ్రెస్ వర్సెస్ బీజేపీ గా రూపాంతరం చెందుతోంది. కేంద్రంలో అధికారంలో ఉన్న బలం, రాష్ట్రంలో పెరుగుతున్న ప్రజాదరణను చూపిస్తూ.. భవిష్యత్తులో కాంగ్రెస్‌ను ఢీకొట్టే ఏకైక శక్తి బీజేపీయేనని నాయకులు ప్రచారం చేస్తున్నారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ ఉనికిని క్రమంగా దెబ్బతీస్తూ, ఆ పార్టీకి ఉన్న ప్రధాన ప్రతిపక్ష స్థానాన్ని ఆక్రమించేందుకు కమలనాథులు సిద్ధమయ్యారు.బీఆర్ఎస్ నుంచి వలసలు పెరగడం వల్ల ఆ పార్టీ కేడర్ చెల్లాచెదురవుతోంది. గతంలో కాంగ్రెస్‌ను వ్యతిరేకించిన ఓటర్లు ఇప్పుడు బీఆర్ఎస్‌ను బలహీనంగా భావించి, కమలం వైపు చేరుతారని నమ్ముతున్నారు. మాజీ మంత్రి మల్లారెడ్డి కోడలు బీజేపీ స్టేట్ ఆఫీస్‌కు రావడం పొలిటికల్ సర్కిల్స్‌లో పెద్ద ఎత్తున చర్చ జరిగింది. మాజీ మంత్రి మల్లారెడ్డి కుటుంబంతో కలిసి ఢిల్లీలో నరేంద్ర మోదీని కలిశారు. దీంతో బీఆర్ఎస్‌లో ఒక్కసారిగా కలకలం రేగింది. మాజీ మంత్రి మల్లారెడ్డి కుటుంబంతో సహా కమలం గూటికి చేరేందుకు రెడీ అయ్యారన్న వార్తలు వస్తున్నాయి. అయితే బీజేపీలో చేరికపై మల్లారెడ్డి కోడలు ప్రీతీరెడ్డి క్లారిటీ ఇచ్చినా..వారి కుటుంబం వేస్తున్న అడుగులు బీజేపీలో చేరేలా ఉన్నాయనే చర్చ నడుస్తోంది. ఇప్పుడు ఇదే అంశం బీఆర్ఎస్‌లోనూ చర్చకు దారి తీసిందంటున్నారు. నరేంద్ర మోదీ రాష్ట్రానికి వస్తున్న నేపథ్యంలో మాజీమంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి, అల్లుడు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, మల్లారెడ్డి కొడుకు భద్రారెడ్డి, కోడలు ప్రీతీరెడ్డి బీజేపీలో చేరబోతున్నారా అనే ఊహాగానాలు మొదలయ్యాయి. బీజేపీ నేతలు కూడా ఈ అంశంపై నర్మగర్భంగా స్పందిస్తుండటం చర్చనీయాంశంగా మారింది.ఇక గ్రేటర్‌లో కీలకంగా ఉన్న కాంగ్రెస్ నేతలే లక్ష్యంగా ఆపరేషన్ ఆకర్ష్‌కు తెర లేపేందుకు సిద్ధమయ్యారట కమలనాథులు. గ్రేటర్ పరిధిలో ఉన్న ఒక్కరిద్దరు కాంగ్రెస్ సీనియర్ నేతలను చేర్చుకునేలా పావులు కదుపుతున్నారట. జీహెచ్ఎంసీ, మల్కాజ్ గిరి కార్పొరేషన్, సైబరాబాద్ కార్పొరేషన్ పరిధిలో పాగా వేసేలా బలమైన నేతలను తమ వైపునకు తిప్పుకునేందుకు వ్యూహాలు రచిస్తున్నారట. నరేంద్ర మోదీ సభ వేదికగా బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలను బీజేపీలోకి తీసుకోవడం ద్వారా ఆ రెండు పార్టీలకు షాక్ ఇవ్వాలనే ప్లాన్ నడుస్తోందట.మోదీ సభను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్న స్టేట్ బీజేపీ లీడర్లు..ఇక మోదీ సభకు ముందు, ఆ తర్వాత అన్నట్టుగా పార్టీ దూకుడు పెంచాలని డిసైడ్ అయ్యారట. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లో ఉన్న బలమైన నేతలను, ఆయా పార్టీలో ఉన్న అసంతృప్త నేతలను ఐడెంటిఫై చేసి వారిని దశల వారీగా కమలం గూటికి చేర్చుకోవాలనేది ప్లాన్ అంటున్నారు. మరి మోదీ సభ వేదికగా బీజేపీలో చేరేదెవరో చూడాలి 2028 నాటికి తెలంగాణలో అధికారం చేపట్టడం అసాధ్యం కాదని పార్టీ గట్టి నమ్మకంతో ఉంది. ప్రస్తుత పరిస్థితుల్లో తెలంగాణలో బీజేపీ గ్రాఫ్ పెరుగుతున్న మాట వాస్తవం. పార్లమెంట్ ఫలితాల జోష్‌ను అలాగే కొనసాగించి, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తేనే మిషన్ 2028 విజయవంతం అవుతుంది. బీఆర్ఎస్ పార్టీని పూర్తిగా దెబ్బతీసి, కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టడంలో బీజేపీ ఎంతవరకు సఫలమవుతుందనే దానిపైనే ఆ పార్టీ భవిష్యత్తు ఆధారపడి ఉంది.





## కాంగ్రెస్ పార్టీలో పదవుల చిచ్చు

అధికారంలోకి వచ్చిన తర్వాత పదవుల పంపకం అనేది ఏ పార్టీకైనా ఒక కత్తిమీద సాము లాంటిదే. పదేళ్ల పాటు ప్రతిపక్షంలో ఉండి, కష్టకాలంలో పార్టీ జెండా మోసిన అసలైన కార్యకర్తలకు గుర్తింపు దక్కనప్పుడు వారిలో ఆవేదన కలగడం సహజం. ప్రస్తుతం తెలంగాణ కాంగ్రెస్‌లో కనిపిస్తున్న ఈ పరిణామాలు చూస్తుంటే, పార్టీని గెలిపించిన 'గ్రౌండ్ లెవల్' నేతలు ఇప్పుడు తమ ఉనికి కోసం పోరాడాల్సిన పరిస్థితి ఏర్పడిందని అర్థమవుతోంది. జీవన్ రెడ్డి వంటి సీనియర్ నేత అసంతృప్తి చల్లారకముందే, ఇప్పుడు ఖమ్మం, మంచిర్యాల జిల్లాల్లో కూడా అసమ్మతి సెగలు రేగడం గమనార్హం తెలంగాణలో అధికార కాంగ్రెస్ పార్టీలో పదవుల పంపకం చిచ్చు రేపుతోంది. క్షేత్ర స్థాయిలో పార్టీ కోసం పనిచేసిన తమను విస్మరించి, కొత్తగా వచ్చిన వారికి లేదా ఒకే వర్గానికి పెద్దపీట వేస్తున్నారని సీనియర్ నాయకులు మండిపడుతున్నారు. ముఖ్యంగా ఉమ్మడి ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో రాజీనామాల పర్వం కొనసాగుతుండడం పార్టీ అధిష్టానానికి తలనొప్పిగా మారింది. ఖమ్మంలో రేణుకా చౌదరి వర్గం ఖమ్మం జిల్లా రాజకీయాల్లో కీలక నేతగా ఉన్న రేణుకా చౌదరి వర్గం ఇప్పుడు బహిరంగంగానే తమ నిరసనను వ్యక్తం చేస్తోంది. జిల్లా, రాష్ట్ర స్థాయి కమిటీల్లో రేణుకా చౌదరి వర్గానికి చెందిన ఒక్క నేతకు కూడా పదవి దక్కకపోవడంపై ఆ వర్గం తీవ్ర ఆగ్రహంతో ఉంది. పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌ను కలిసి తమ గోడును వెళ్లబోసుకున్నారు. 'పార్టీ కష్టాల్లో ఉన్నప్పుడు పనిచేసిన మాకు గుర్తింపు ఎక్కడ?' అని వారు నిలదీస్తున్నారు. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి నియోజకవర్గంలో పరిస్థితి మరింత తీవ్రంగా ఉంది. ఎమ్మెల్యే వినోద్ గెలుపునకు అహర్నిశలు శ్రమించిన సీనియర్లను కాదని, కొత్త వారికి పదవులు కట్టబెడుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఎమ్మెల్యే ఏకపక్ష నిర్ణయాలకు నిరసనగా కాసీపేట మండలానికి చెందిన పలువురు సీనియర్ నాయకులు పార్టీకి రాజీనామా చేశారు. ఇది పార్టీ క్యాడర్‌లో గందరగోళానికి దారితీస్తోంది. నిజమైన కార్యకర్తల ఆవేదన పార్టీ కోసం ఏళ్ల తరబడి పనిచేసిన వారు ఇప్పుడు తమను 'సెకండ్ క్లాస్' సిటిజన్స్‌లా చూస్తున్నారని భావిస్తున్నారు. పదవులన్నీ కేవలం ఒకే వర్గానికి లేదా ఒకే నాయకుడి అనుచరులకే ఎలా ఇస్తారని వారు ప్రశ్నిస్తున్నారు. ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి ప్రాధాన్యత పెరగడం, పాత తరం నాయకులను పక్కన పెట్టడం వల్ల పార్టీ అంతర్గత క్రమశిక్షణ దెబ్బతింటోందని విశ్లేషకులు భావిస్తున్నారు. జీవన్ రెడ్డి వంటి ఉద్ధండులే పార్టీని వీడుతున్నారనే వార్తల నేపథ్యంలో, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఈ అసమ్మతిని ఎలా చల్లారుస్తారన్నది ఆసక్తికరంగా మారింది. జిల్లాల్లో పేరుకుపోయిన ఈ అసంతృప్తిని త్వరగా పరిష్కరించకపోతే, అది రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రభావం చూపే అవకాశం ఉంది.



## కవితకు తమిళ ఎన్నికల ఊపు

భారత్ రాజకీయాల్లో తమిళనాడు ఎప్పుడూ కొత్త ట్రెండ్ సృష్టిస్తూ వస్తోంది. తాజా ఫలితాల్లో ఇది మరోసారి రుజువు చేసింది. ఇప్పుడు ఈ మార్పు దేశ రాజకీయాలను మార్చబోతోందనే చర్చ మొదలైంది. ఇప్పుడు ఇక్కడ ప్రజలు ఇచ్చిన తీర్పు ఒక రాష్ట్రానికే పరిమితం కాదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఈ క్రమంలోనే తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు కవిత చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో పెను సంచలనం సృష్టిస్తున్నాయి. తమిళ ప్రజలు పంపిన ఈ సంకేతం దేశమంతటా ప్రతిధ్వనిస్తుందని అభిప్రాయపడ్డారు. తమిళనాడులో కొత్త రాజకీయ శక్తులు, ముఖ్యంగా నటుడు విజయ్ నేతృత్వంలోని టీవీకే సాధిస్తున్న విజయాన్ని పరోక్షంగా కవిత ప్రస్తావించారు. దీనిపై సోషల్ మీడియాలో తన అభిప్రాయాన్ని పోస్టు చేశారు. ఆమె మాటల్లో చెప్పాలంటే ఇది కేవలం ఒక ఎన్నికల ఫలితం కాదు, పాత రాజకీయ చరిత్రను తిరగరాయాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. భ్రష్టు పట్టిపోయిన ప్రస్తుత రాజకీయ వ్యవస్థలో మార్పు రావాలని, కొత్త తరం నాయకత్వం, విభిన్నమైన రాజకీయ ఆలోచనలు ప్రజల ముందుకు రావాలని ఆమె పిలుపునిచ్చారు. ప్రజలు పాత పద్ధతులతో ఎందుకు విసిగిపోయారని కవిత అన్నారు. కేవలం అధికారమే పరమావధిగా పని చేసే నాయకుల పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని అన్నారు. వారిపై ఉన్న అసహనం కారణంగానే ప్రజలు ప్రత్యామ్నాయ శక్తులవైపు మొగ్గు చూపుతున్నారని పేర్కొన్నారు. వ్యవస్థలో పేరుకుపోయిన లోపాలను సరిదిద్దాలంటే కొత్త రాజకీయ శక్తులు రావాడం అనివార్యమని అభిప్రాయపడ్డారు.తెలంగాణలో తనదైన ముద్ర రాజకీయ ముద్ర వేయాలని చూస్తున్న కవితకు తమిళనాడు ఎన్నికల ఫలితం ఒక ఆశాకిరణంగా కనిపిస్తున్నాయి. అందుకే రాజకీయ చరిత్రను తిరగరాయాల్సిన సమయం వచ్చిందని ఆమె చేసిన కామెంట్స్ టీఆర్ఎస్ ఆలోచనను స్పష్టం చేస్తున్నాయి. కొత్తగా పార్టీ పెట్టిన తను కొత్త ఆలోచనలతో వస్తున్నానని ప్రజలకు మంచి చేసే తమలాంటి వారిని ప్రజలు ఆదరించాలని చెబుతున్నారు. బీఆర్ఎస్‌తో విభేదించిన కవిత గత నెలలోనే టీఆర్ఎస్ పేరుతో కొత్త పార్టీ పెట్టారు. ఐదు ముఖ్యమైన లక్ష్యాలతో పార్టీ పెట్టినట్టు వెల్లడించారు. వాటి కోసం తాను పోరాడతానని చెప్పుకొచ్చారు. ఇప్పుడు తమిళనాడులో కూడా పార్టీ పెట్టిన రెండేళ్లలోనే ప్రజలకు చేరువైన టీవీకే మాదిరిగానే తాను కూడా ప్రజలు చేరువ అయ్యేందుకు కవిత ప్రయత్నిస్తున్నారు. అందుకే కొత్త తరం ఆలోచనలతో వస్తున్న తమ లాంటి వారికి ప్రజలు ఛాన్స్ ఇవ్వాలని సూచిస్తున్నారు. ఇదే విషయాన్ని తన సోషల్ మీడియా పోస్టు ద్వారా చెప్పుకొచ్చారు.

## ఆగస్ట్ నుంచి మూసీ ప్రాజెక్టు పనులు ప్రారంభం



మూసీ నది సుందరీకరణకు ముహూర్తం ఖరారైంది. ఈ ఏడాది ఆగస్ట్ నుంచి మూసీ ప్రాజెక్టు పనులు ప్రారంభం కానున్నాయి.మూసీ ప్రాజెక్టుపై చర్చించేందుకు కేబినెట్ సబ్ కమిటీ శుక్రవారం సమావేశమైంది. ఈ సందర్భంగా ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్ వివరాలను అధికారులు మంత్రులకు అందజేశారు. ఈ నేపథ్యంలో తొలిదశలో రూ.7,055 కోట్లతో పనులు చేపట్టాలని నిర్ణయించారు. ఆగస్ట్ నుంచి పనులు ప్రారంభించి 2027 డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు.మూసీ నది సుందరీకరణ దిశగా అడుగులు పడుతున్నాయి. మూసీ ప్రాజెక్టు పనులను ఈ ఏడాది ఆగస్టు నుంచి ప్రారంభించాలని నిర్ణయించారు. మూసీ నది సుందరీకరణ ప్రాజెక్టుపై తెలంగాణ ప్రభుత్వం కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఈ కేబినెట్ సబ్ కమిటీ శుక్రవారం సమావేశమై వివిధ అంశాలపై చర్చించింది. ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్ పరిశీలించింది. ఈ నేపథ్యంలోనే తొలిదశలో రూ.7,055 కోట్లతో పనులు చేపట్టాలని నిర్ణయించారు. తొలి దశ పనులకు సంబంధించి ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంకుతో చర్చలు ముగిసినట్లు అధికారులు మంత్రులకు తెలియజేశారు.మరోవైపు ప్రాజెక్టు తొలిదశలో నిర్మాణాలపై ప్రభావం లేని ఐదు కిలోమీటర్ల మేరకు పనులు ప్రారంభించాలని కేబినెట్ సబ్ కమిటీ అధికారులను ఆదేశించింది. నిర్మాణాలపై తక్కువగా ప్రభావం పడేలా అలైన్‌మెంట్ మార్చాలని కేబినెట్ సబ్ కమిటీ సూచించింది. మరోవైపు ఆగస్టు నెల నుంచి పనులను ప్రారంభించి.. 2027 డిసెంబర్ నాటికల్లా పూర్తిచేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. మూసీ పునరుజ్జీవనం ప్రాజెక్టు ప్రజా భాగస్వామ్యంతోనే అమలు చేస్తామని మంత్రివర్గ ఉపసంఘం స్పష్టం చేసింది. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని, వారి ఆస్తులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా ప్రాజెక్టును రూపొందించాలని అధికారులకు స్పష్టం చేసింది. ఇందుకోసం ప్రాజెక్టు అలైన్‌మెంట్‌లో మార్పులు చేసి నిర్మాణాలపై ప్రభావం తగ్గించేలా చూడాలని అధికారులకు స్పష్టం చేసింది.మరోవైపు మొత్తం 55 కిలోమీటర్ల మేరకు మూసీ ప్రాజెక్టును చేపడుతున్నారు. 5 దశల్లో ఈ ప్రాజెక్టు పనులు జరగనున్నాయి. తొలి దశలో హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్‌ల నుంచి బాపుఘాట్ వరకూ పనులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ప్రాజెక్టులో భాగంగా మూసీ నదిలోని చెత్తను తొలగిస్తారు. రివర్ బెడ్ ప్రొఫైలింగ్ చేపడతారు. రిటైనింగ్ వాల్స్, రెండు వైపులా రహదారులు, మురుగు కాలువలు, బ్యారేజీలు, రివర్ ఫ్రంట్ అభివృద్ధి వంటి పనులు చేపడతారు.డిసెంబర్ 2027 నాటికల్లా ప్రాజెక్టును పూర్తి చేయాలని తెలంగాణ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అందుకు అనుగుణంగా చర్యలు చేపడుతోంది

